## ఫస్ట్ నుంచి చికెన్ షాపులు బంద్



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం.

గుంటూరు - గురువారం 26 మార్చి 2026 | సంపుటి: 10 | సంచిక: 80 | పేజీలు: 8+4 | వెల: రూ.5

## అగ్నివీరులకు 20% కోటా



2

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM




# 50 వేల హోటల్ రూమ్‌లు, 10 వేల హోం స్టేలు

### ఏపీలో పర్యాటకానికి పక్కా ప్లాన్

### ముఖ్యమంత్రి చంద్రబాబు

2029 కల్లా ఆంధ్రప్రదేశ్ అంటేనే పర్యాటకం, పర్యాటకం అంటే ఆంధ్రప్రదేశ్ అన్నంతగా అభివృద్ధి జరగాలని, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. 2029కల్లా 50 వేల హోటల్ రూమ్ లు, 10 వేల హోం స్టేలు ఉండేలా పక్కా ప్లాన్ చేయాలన్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి లాంటి 15 ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేయాలని సూచించారు.

**అమరావతి, మార్చి 25 (మనం ప్రత్యేక ప్రతనిధి):** రాష్ట్రంలో పెరుగుతోన్న పర్యాటకుల ఫుట్ ఫాల్కు అనుగుణంగా ఏపీలో హోటల్ గదులు, హోం స్టేలను త్వరితగతిన అందుబాటులోకి

...మిగతా 2లో

### శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ

# యుద్ధం చేస్తాం



### అమెరికా షరతులకు ఇరాన్ కౌంటర్ కండిషన్స్



కాల్పులకు 5 రోజులు విరామం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒక పక్క ఇరాన్ మేం చెప్పినట్టు వింటోంది అనే టైపులో మాట్లాడుతూ యుద్ధం త్వరలోనే ముగుస్తుందన్న సంకేతాలిస్తున్నారు. అయితే, ఇరాన్ మాత్రం వెనక్కి తగ్గేదే లేదు అంటోంది. ఇజ్రాయెల్ మాత్రం ట్రంప్ మాటలు ఖాతరు చేయకుండా కాల్పులు జరుపుతూనే ఉంది. దీనితో యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసేలా లేదని అర్థమవుతోంది.

**టెహ్రాన్, మార్చి 25:** యుద్ధం ముగించే విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పేర్కొంటుండగా.. ఇరాన్ మాత్రం దీనికి భిన్న స్వరాలు వినిపిస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ పశ్చాత్తాప పడేవరకూ దాడులు కొనసాగుతూనే ఉంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ చెప్పారు. ప్రస్తుత పరిస్థితులపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో చర్చల సందర్భంగా అరాగ్చీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఇరాన్ పౌర,

...మిగతా 2లో





# బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి

### హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు

### విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

### రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,మార్చి,25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** బీసీ హాస్టళ్లపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుందని, ఈలోగా హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో

...మిగతా 2లో

# ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఎంఓయూ

**అమరావతి, మార్చి 25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ను కలినరీ టూరిజం హబ్ గా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏపీ పర్యాటక శాఖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ కీలకమైన ఎంఓయూ కుదిరింది. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు- ఏపీ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ లు సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. తెలుగు రుచులను, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు



ప్రాంతీయ ఆహార సంస్కృతిని చాటి చెప్పేలా ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ సహకారం అందించనుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌ను కలినరీ

...మిగతా 2లో

### ఆంధ్రాలో ప్రకాశిస్తున్న

# పీఎం సూర్య ఘర్

- దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి
- 1.14 లక్షల ఇళ్లపై సౌర పలకలు
- లోక్ సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశ్నకు కేంద్రం సమాధానం



2

# విజయవాడలో ఉగ్ర నీడలు!

### 45 మందితో టెర్రర్ గ్రూప్ పెట్టిన సైదా బేగం



బెజవాడ మరో సారి ఉగ్ర నీడతో ఉలిక్కి పడింది. సైదాబేగం అనే మహిళతోపాటు బెంగళూరుకు చెందిన అబ్దుల్ అనే మరో టెర్రరిస్టును విజయవాడ పోలీసులు పట్టుకున్నారు. ఏడాది క్రితం భర్తతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్న సైదా బేగం. రాత్రి సమయాల్లో సోషల్ మీడియాలో టెర్రర్ పోస్టింగ్ లు చేస్తూ, ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేసుకొని యువతను టెర్రర్ వైపు మళ్లిస్తున్నట్లు పోలీసుల నేరపరిశోధనలో బయటపడింది.

**విజయవాడ, మనం క్రైం బ్యూరో:** విజయవాడలో టెర్రరిజం లింకులు ఉన్న మరో ఇద్దరు రిమాండ్ అయ్యారు, హైదరాబాద్ కు చెందిన సైదాబేగం, బెంగళూరుకు చెందిన అబ్దుల్ అరెస్ట్ చేసి. ఇద్దర్ని కోర్టులో విజయవాడ పోలీసులు హాజరుపరిచారు. విజయవాడ టెర్రర్ లింక్ లో కొత్త విషయాలు . 42 మందితో టెర్రర్ గ్రూపును ఏర్పాటు చేసి పోస్టింగ్స్ చేసిన సైదా బేగం. ఏడాది క్రితం భర్తతో విడాకులు తీసుకొని వెలుగులోకి వచ్చాయి. హైదరాబాదుకు చెందిన సైదా బేగం ఇక్కడ ఒంటరిగా ఉంటూ. రాత్రి సమయాల్లో సోషల్ మీడియాలో టెర్రర్ పోస్టింగ్ లు చేస్తుంది. ఎప్పటికప్పుడు టెర్రర్ పోస్టింగ్ లు. ఫర్వాడ్ చేస్తూ, దీని కోసం ప్రత్యేక సంస్థ ఏర్పాటు చేసుకొని ప్రచారం చేస్తోంది. యువతను టెర్రర్ వైపు మళ్లిస్తున్న సైదా బేగంను పోలీసులు పట్టుకున్నారు, ఏడాది క్రితం భర్తతో విడాకులు తీసుకొని ఒంటరిగా ఉంటున్న సైదా బేగం. రాత్రి సమయాల్లో సోషల్ మీడియాలో టెర్రర్ పోస్టింగ్ లు చేస్తుంది. యువతను టెర్రర్ వైపు మళ్లిస్తున్న సైదా బేగం విజయవాడలో ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన అనుమానాలతో ముగ్గురు యువకులను ఆంధ్రప్రదేశ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మార్చి 2026 చివరి వారంలో జరిగిన ఈ సంఘటన నగరంలో కలకలం రేపింది. అరెస్ట్ అయిన వారిలో మహ్మద్ రహ్మతుల్లా షరీఫ్ (23), మీర్జా సోహైల్ బేగ్ (23), మరియు మహ్మద్ డానిష్ (27) ఉన్నారు. వీరు నగరంలోని

...మిగతా 2లో

# వాట్సాప్ మన మిత్ర ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు

- సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి
- ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ, సీట్ల కేటాయింపు పటిష్టంగా అమలు చేయాలి
- వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది
- మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



2

### కపిలతీర్థంలో కోదండరాముడి

# చక్రస్నానం

భక్తి వైభవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

3

# వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్.. సింగపూర్తో ఏపీ చర్చలు

- సింగపూర్ ప్రతినిధులతో మంత్రి అచ్చెన్నాయుడు వీడియో కాన్ఫరెన్స్
- ఎగుమతుల పెంపు, పెట్టుబడుల ఆకర్షణపై మంత్రి వివరణ
- తీర ప్రాంత అభివృద్ధి, మత్స్య రంగంపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయం, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలపై విస్తృత చర్చలు
- ఫుడ్ సెక్యూరిటీ నుంచి లాజిస్టిక్స్ వరకూ.. సమగ్ర చర్చలు జరిపిన మంత్రి అచ్చెన్న

**అమరావతి/ విజయవాడ, మార్చి 25,మనం ,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ దేశ ప్రతినిధులతో బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి కీలక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ రంగంలో గ్లోబల్ కనెక్టివిటీ, ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక సాంకేతికత వినియోగంపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ దేశం తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ దేశం అనుసరిస్తున్న ఆహార భద్రతా విధానాలు, నిల్వ పద్ధతులు, సరఫరా అనుబంధాల నిర్వహణపై మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల సంరక్షణ చర్యలు, సమయానికి సరఫరా,

...మిగతా 2లో





రెవిన్యూ సేవల్లో మేటి ఖాజావలి

# భూ సమస్యలపై సత్వర చర్యలు

**గుంటూరు, మార్చి 25 మనం న్యూస్:** రెవిన్యూ సమస్యలపై ప్రజల ఫిర్యాదులకు గుంటూరు కలక్టరేట్ సత్వరం స్పందిస్తుందని గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.

...మిగతా 2లో

### చమురు నౌకల రక్షణ కోసం

# ఆపరేషన్ ఊర్జా సురక్షా చేపట్టిన నేవీ

### సేఫ్‌గా దేశానికి వస్తున్న చమురు, గ్యాస్ ట్యాంకర్లు






**ఢిల్లీ, మార్చి 25:** పశ్చిమాసియాను దాటి చమురు, గ్యాస్ నౌకలు ఒక్కొక్కటిగా భారత్ చేరుకుంటున్నాయి. ఈ నౌకల భద్రత కోసం ఇండియన్ నేవీ 'ఆపరేషన్ ఊర్జా సురక్షా'ను చేపట్టి వాటిని సురక్షితంగా హర్మూజ్ ను దాటిస్తోంది. సాధారణంగా భారత్ వచ్చే చమురు/గ్యాస్ నౌకలు సౌదీ అరేబియాలోని రాస్ తనురా వంటి పోర్టుల నుంచి ప్రయాణం ప్రారంభిస్తాయి. ఇవి పర్షియన్ గల్ఫ్ మీదుగా హర్మూజ్ జలసంధి వద్దకు చేరుకుంటాయి. నౌక వేగం, ప్రయాణించే మార్గాన్ని బట్టి ఇందుకు గరిష్ఠంగా రెండు రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ జలసంధి వద్దే వందలాది నౌకలు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో వాటిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు భారత నౌకాదళం రంగంలోకి దిగింది. ఇరాన్ అధికారుల

...మిగతా 2లో

# యుద్ధం వల్ల ఆహార భద్రతకు ముప్పు

### డబ్ల్యూటీవో అధికారి జేన్ మేరీ పౌగమ్



**న్యూయార్క్, మార్చి 25:** ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హర్మూజ్ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పౌగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో.. ఎరువుల కొరత, అధిక ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని మూడింట

...మిగతా 2లో

### నేటి నుంచి భద్రాచలంలో

# బ్రహ్మోత్సవాలు

### రేపు శ్రీసీతారాముల కళ్యాణం.. ఎల్లుండి శ్రీరామ మహా పట్టాభిషేకం



2

## ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్‌తో ఎంఓయూ

(మొదటి పేజీ తరువాయి)

టూరిజానికి ఓ కీలకమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు వీలుగా ఈ ఎంఓయూ తోడ్పడనుంది. ప్రత్యేకించి కలినరీ విభాగంలో నైపుణ్యాభివృద్ధి కల్పన, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, ఏపీ టూరిజం అథారిటీ నిర్వహించే ఫుడ్ ఫెస్టివల్స్, టూరిజం ఈవెంట్లను నిర్వహించనున్నారు.

ఇందులో భాగంగా తెలుగు వంటకాల రుచులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలియచేసేలా కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీ హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడలో ఉగ్ర నీడలు!

(మొదటి పేజీ తరువాయి)

వించిపేట, భవానీపురం ప్రాంతాలకు చెందినవారు. సోషల్ మీడియా వేదికగా ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేయడం, యువతను జిహాద్ వైపు ప్రేరేపించడం పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి ఉండటం వంటి ఆరోపణలు వీరిపై ఉన్నాయి.నిందితులను విజయవాడ సీఎంఎం (ఇఇ) కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి ఏప్రిల్ 6, 2026 వరకు రిమాండ్ విధించింది. దేశవ్యాప్తంగా ఉగ్రమూలాలపై కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో, ఏపీ సీఐ సెల్ అధికారులు సామాజిక మాధ్యమాలపై నిరంతర నిఘా ఉంచి ఈ ముఠాను పట్టుకున్నారు.

# 50 వేల హోటల్ రూమ్‌లు, 10 వేల హోం స్టేలు

(మొదటి పేజీ తరువాయి)

తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. 2029 నాటికి రాష్ట్రంలో 50 వేల హోటల్ గదుల నిర్మాణం లక్ష్యాన్ని చేరుకోవాలని సీఎం సూచనలు జారీ చేశారు. వివిధ పర్యాటక ప్రాంతాల్లో 10 వేలకు పైగా హోం స్టేలు కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. హోంస్టేలను అందుబాటు లోకి తీసుకువచ్చే అంశంపై ఎలాంటి పరిమితీ లేదని వివరించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సహా పర్యాటక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో ఆమోదం తెలియజేసిన టూరిజం ప్రాజెక్టులు వేగంగా ఏర్పాటు అయ్యేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు, నగరాల్లో జాతీయ, అంతర్జాతీయ హోటల్ బ్రాండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి కూడా రాజమహేంద్రవరం సహా వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున హోం స్టేల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. హోం స్టేల నిర్వహణకు సంబంధించి రేటింగ్ కూడా పెట్టాలని దిశానిర్దేశం చేశారు.అరకు, చింతపల్లి, ముంచింగిపుట్టు, గాంధీవనం, మారేడుమిల్లి తదితర ప్రాంతాలతో పాటు కనీసం 10-15 ప్రాంతాల్లో కారావాన్ పార్కుల ను ఏర్పాటు చేయాలని సూచించారు. కారావాన్లను పార్కింగ్ చేసుకుని కుటుంబంతో సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా ఆయా పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఎక్స్ పీరియన్స్ కేంద్రాల వద్ద కూడా ఈ తరహా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి, విశాఖలలో అమ్యూజ్ మెంట్ పార్కుల ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సీఎం సూచనలు జారీ చేశారు. అటవీ, దేవాదాయ శాఖల సమన్వయంతో ఎకో, టెంపుల్ టూరిజానికి ప్రోత్సాహం ఇచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద వివిధ దేవాలయాలు, దర్శనీయ స్థలాల అభివృద్ధికి చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి సిద్ధం చేయాలని అన్నారు. దీనికి సంబంధించి మరో రూ.663 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు పర్యాటక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గండికోట, సూర్యలంక, అరకు బొర్రా గుహలు తదితర ప్రాంతాలను ప్రముఖ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలన్నారు. గోదావరి పుష్కరఘాట్ను ఆగస్టు నాటికి, హావ్ లాక్ బ్రిడ్జిపైకి పర్యాటకులను అనుమతించేలా ఈ ఏడాది డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**పర్యాటక ప్రోత్సాహానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ**

రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా ఓ బోర్డు లేదా కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లాలని సీఎం దిశానిర్దేశం చేశారు. పర్యాటకశాఖ, అటవీ, దేవాదాయ, పోలీసు, మెరైన్ ఇలా వేర్వేరు శాఖల సమన్వయం కోసం సీఎస్ అధ్యక్షతన దీనిని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హౌస్ బూట్లు, హెలీ టూరిజంతో పాటు ఉడాన్ పథకం కింద సీ ప్లేన్లను కూడా ప్రోత్సహించాలని అన్నారు. విశాఖ, విజయవాడ, శ్రీశైలం, గండికోట, కంభం చెరువు లాంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందించాలని సూచించారు. సముద్ర విహారాన్ని ప్రోత్సహించేలా విశాఖ, నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను కూడా నిర్వహించేలా చూడాలన్నారు. తెలంగాణా లాంటి ల్యాండ్ లాక్డ్ రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు దీనికి పెద్ద ఎత్తున ఆకర్షితులు అవుతారన్నారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసే టెంట్ సిటీలను కేటగిరీలుగా విభజించి ప్రోత్సహిస్తే అందరికీ అందుబాటులోకి వస్తాయన్నారు. కనీసం వెయ్యి టెంట్ సిటీలను గోదావరి పుష్కరాల నాటికి అందుబాటులోకి తేవాలని సీఎం సూచనలు జారీ చేశారు. క్రియేటివ్ ఎకనామీని ప్రోత్సహించేందుకు కంటెంట్ క్రియేషన్ పెద్ద ఎత్తున జరగాలన్నారు. క్రియేటివ్ ఎకానమీని సృష్టించేలా అమరావతి క్రియేటివ్ సిటీగా ఎదగాలన్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా క్రియేటివ్ ఎకనామీ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఐకానిక్ డెస్టినేషన్ స్కీమ్ కింద విశాఖ, తిరుపతి నగరాలను అభివృద్ధి చేయాలని.. ప్రతీ ఐకానిక్ డెస్టినేషన్ కు రూ.500 కోట్ల వరకూ వెచ్చించేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. గత ఏడాదిలో పర్యాటక ప్రాంతాలకు 30.92 కోట్ల మంది పర్యాటకుల ఫుట్ ఫాల్ నమోదైందని ఈ ఏడాదిలో 9 నెలల కాలానికి గానూ 21 శాతం మేర వృద్ధి కనిపించిందని.. ఇది మరింత పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన ఆలయాలను అనుసంధానించి టెంపుల్ టూరిజం కూడా ఇంటిగ్రేట్ చేయాలని సీఎం సూచించారు. సూర్యలంక బీచ్ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్ చేపట్టాలన్నారు. వీటితో పాటు తిరుపతిలో ఉన్న చెరువులు, అమరావతి ప్రాంతంలోని కాలువలు, విశాఖ సహా వేర్వేరు ప్రాంతాలను సుందరీకరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

# ఫస్ట్ నుంచి చికెన్ షాపులు బంద్

**హైదరాబాద్, మార్చి 25:** పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణలో చికెన్ వ్యాపారులు ఆందోళనకు దిగుతున్నారు. తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు ఎదుర్కొంటున్నందున.. దీనికి నిరసనగా ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. చికెన్ ధరలు పెరిగినా, మధ్యవర్తుల విధానాల వల్ల తాము లాభపడడం లేదని వ్యాపారులు అంటున్నారు. తమ సమస్యలను పౌల్ట్రీ కంపెనీలకు పలుమార్లు తెలియజేసినా, సరైన స్పందన రాలేదని వారు తెలిపారు. ఈ కారణంగానే తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఏప్రిల్ 1 నుంచి నిరవధికంగా చికెన్ షాపులను మూసివేస్తామని హెచ్చరించారు. చికెన్ షాపుల బంద్ వల్ల వినియోగదారులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించాలని చికెన్ వ్యాపారులు కోరుతున్నారు.

# అగ్నివీరులకు 20% కోటా



**ఢిల్లీ, మార్చి 25:** అగ్నివీరులకు ఆయా విభాగాల్లో 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. అగ్నివీర్ తొలి బ్యాచ్ నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకొని 2027లో బయటకు రానున్న నేపథ్యంలో.. వారికి ఆయా రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రం భావిస్తోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు సహా పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అగ్నివీరులకు రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.ప్రభుత్వ నియామకాల్లో అగ్నివీరులకు కనీసం 20శాతం ఉద్యోగాలు రిజర్వ్ చేయాలని సిఫార్సు చేస్తూ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ రాశారు. త్రివిధ దళాల్లో పదవీ విరమణ చేసిన వారికి మాదిరిగానే అగ్నివీరులకు కూడా రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని అందులో పేర్కొన్నారు.
ముఖ్యంగా ఫారెస్ట్ గార్డులు, మైనింగ్ గార్డులు, పోలీస్ కానిస్టేబుల్, ఫైర్మెన్, జైలు వార్డెన్లు, ప్రత్యేక పోలీస్ అధికారులు, ఎస్డీఆర్ఎఫ్ విభాగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు.

# వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్.. సింగపూర్తో ఏపీ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

సమర్థవంతమైన రవాణా నిర్వహణపై సింగపూర్ ప్రతినిధులు అమలు చేస్తున్న విధానాలను వారు వివరించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలు, ఎగుమతుల పెంపు, ఆధునిక సాంకేతికత వినియోగం, పెట్టుబడుల ఆహ్వానం వంటి అంశాలపై మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతులకు లాభసాటి ధరలు అందించే విధంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశారు. పబ్లిక్ పాలసీల రూపకల్పనలో సాధారణ ప్రజల అభిప్రాయాలను ఎలా సేకరిస్తారు, వాటిని ఎలా అమలు చేస్తారు అనే అంశంపై ఇరు పక్షాల మధ్య చర్చ జరిగింది. సింగపూర్ ప్రతినిధులు డేటా అనలిసిస్, యుటిలైజేషన్ ద్వారా పాలసీలను ఎలా రూపొందిస్తారో వివరించారు. ఈ విధానాలను రాష్ట్రంలో కూడా అమలు చేసే అవకాశాలపై మంత్రి ఆసక్తి వ్యక్తం చేశారు. సముద్ర తీర ప్రాంత అభివృద్ధి, తీర ప్రాంత వ్యవసాయం, మత్స్య రంగానికి సంబంధించిన అవకాశాలు, తీర ప్రాంత మౌలిక సదుపాయాల పెంపు వంటి అంశాలపై కూడా చర్చించారు. సింగపూర్ లో అమలు చేస్తున్న ఆధునిక తీర అభివృద్ధి నమూనాలను రాష్ట్రంలో అనుసరించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కోల్ స్టోరేజ్ మేనేజ్మెంట్ పై కూడా ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఆహార ఉత్పత్తుల నిల్వ, నాణ్యత పరిరక్షణ, నష్టాలను తగ్గించే విధానాలు, ఆధునిక కోల్ చైన్ వ్యవస్థలపై ఇరు పక్షాలు ప్రశ్నలు అడిగి సమాధానాలు ఇచ్చుకున్నారు. ఈ రంగంలో సాంకేతిక సహకారం పెంపుపై చర్చించారు. ఇరు దేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారం, జ్ఞాన మార్పిడి, పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆధునిక వ్యవసాయ విధానాలు, సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి ఈ చర్చలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆఫిషియో, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ యుద్ధం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)



రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయడమే.. ఈ ప్రాంతంలో అస్థిరతకు కారణమని వెల్లడించారు. తమ లక్ష్యాలన్నీ నెరవేరి.. హింసాత్మక దురాక్రమణకు పాల్పడినందుకు గాను శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ ప్రతీకార దాడులు కొనసాగుతాయన్నారు. తమ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడం తమ మొదటి ప్రాధాన్యం అని వెల్లడించారు. హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో సహా తాము తీసుకున్న చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయన్నారు.

## స్థావరాల్ని తొలగించాలె

### అమెరికాతో చర్చలకు ఇరాన్ షరతులివే

**టెహ్రాన్, మార్చి 25:** ఇరాన్‌తో శాంతి చర్చలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆచితూచి స్పందిస్తోంది. ముందుగా చర్చల ప్రసక్తే లేదని తేల్చిన ఇరాన్, ఇప్పుడు మాత్రం స్వరం మార్చింది. తమ ప్రతిపాదనలకు అంగీకరిస్తే అమెరికాతో చర్చలు జరుపుతామని ప్రకటించింది. ఈ మేరకు అమెరికాకు కీలక ప్రతిపాదనలు చేసింది. గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక క్యాంపులను ఎత్తివేయడం అన్నింటికంటే కీలకమైన షరతు. అలాగే, ఇరాన్ పై ఉన్న ఆంక్షల్ని ఎత్తివేయడంతోపాటు నౌక రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిపై పూర్తి హక్కు కల్పించాలి. అలాగే, యుద్ధం వల్ల తమకు కలిగిన నష్టానికి పరిహారాన్ని కూడా ఇరాన్ కోరింది. దీంతోపాటు లెబనాన్ ఇజ్రాయెల్ దాడులు ఆపాలని కూడా ఇజ్రాయెల్ డిమాండ్ చేసింది. హర్మూజ్ జలసంధి నుంచి రవాణా చేసే నౌకలపై పన్ను వసూలు చేస్తారు. దీనికి సంబంధించి పూర్తి ఆధిపత్యం తమకు దక్కాలని ఇరాన్ కోరుతోంది. ఇకపై ఈ ప్రాంతంలో తిరిగి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా చూస్తామని అమెరికా హామీ ఇవ్వాలి. ఇలాంటి అనేక డిమాండ్లను ఇరాన్.. అమెరికా ముందుంచింది. వీటితోపాటు కొన్ని అంశాల విషయంలో ఇరాన్ పట్టువీడినట్లు తెలుస్తోంది.



**బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని నిలిపేస్తం..**

ఐదేళ్లపాటు బాలిస్టిక్ మిస్సైళ్ల తయారీని నిలిపివేస్తామని తెలిపింది. అలాగే, యురేనియం నిల్వల్ని కూడా తగ్గించుకునేందుకు అంగీకరించింది. ఇరాన్లోని అణ్వాయుధాలు, యురేనియంపై అంతర్జాతీయ సంస్థల తనిఖీకి కూడా అంగీకరించింది.

మరోవైపు తీవ్రవాద నిర్మూలనలో కూడా పాలుపంచుకునేందుకు ముందుకొచ్చింది. దీనిలో భాగంగా ఇరాన్ సమీపంలోని దేశాల్లో ఉండే హెజ్బొల్లా, హమాస్, ఇరాకీ మిలీషియాస్ వంటి తీవ్రవాద సంస్థలకు నిధులు అందించడం నిలిపివేస్తామని కూడా తెలిపింది. అయితే, ఈ అంశాలన్నింటిపై అధికారిక ప్రకటన రాలేదు. కానీ, అమెరికాతో చర్చల విషయంలో మధ్యవర్తుల ద్వారా సందేశం పంపినట్లు తెలుస్తోంది. అమెరికా చర్చల ప్రతిపాదనను ఇరాన్ తప్పుబడుతోంది. అమెరికా తనతో తానే చర్చించుకుంటోంది అని ఇరాన్ మిలిటరీ ప్రతినిధి ఎబ్రహీమ్ అన్నారు.

### యుద్ధం ముగింపునకు..

## ఇరాన్‌కు ట్రంప్ 15 కండిషన్స్

**వాషింగ్టన్, మార్చి 25:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా 15 కండిషన్స్‌తో కూడిన ప్రతిపాదనలను ఇరాన్కు పంపినట్లు తెలుస్తోంది. ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్ (ఐట్చు)కు పంపించినట్లు సమాచారం. అయితే, ఈ కాల్పుల విమరమణ గురించి ఇజ్రాయెల్కు అగ్రరాజ్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. కండిషన్స్‌లో ముఖ్యమైనవి..

- ఇరాన్ తనకున్న అణుసామర్థ్యాలను తప్పనిసరిగా నిర్వీర్యం చేయాలి. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డో అణు కేంద్రాలను ధ్వంసం చేయాలి.
- అణ్వాయుధాలు ఎప్పటికీ సమకూర్చుకోబోమని ఇరాన్ హామీ ఇవ్వాలి.
- ఇరాన్ భూభాగంపై అణుశుద్ధి జరగకూడదు
- ఇరాన్ తన వద్ద నిల్వ ఉంచుకున్న 450 కిలోల యురేనియంను ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి అప్పగించాలి.
- హర్మూజ్ జలసంధిని తెరవాలి. దాన్ని ఫ్రీ మారిటైమ్ కారిడార్ గా నిర్వహించాలి.
- ఇరాన్ క్షిపణి కార్యక్రమాలను పరిమితంగా చేపట్టాలి. వాటి రేంజ్, సంఖ్యను తగ్గించుకోవాలి. ఆత్మరక్షణ కోసం క్షిపణులను ఉపయోగించుకోవాలి.

**మరో 1000 మంది బలగాలు..**

ఈ షరతులకు అంగీకరిస్తే.. ఇర్రాన్ అంతర్జాతీయ సమాజం విధించిన ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేస్తామని అమెరికా ఈ ప్రణాళికలో హామీ ఇచ్చింది. అంతేగాక.. పౌర అణు ఇంధనశక్తిని పెంపొందించుకొనే కార్యక్రమాలకు సాయం అందిస్తామని తెలిపింది. అయితే, ఓవైపు శాంతి ప్రణాళికను ఆఫర్ చేస్తూనే పశ్చిమాసియాకు మరో 1000 మంది సైన్యంతో పాటు రెండు మెరైన్ యూనిట్లను ఈ ప్రాంతంలో మోహరించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తుండడం దాని వైఖరికి నిదర్శనం.

**ఓటమిని ఒప్పందం అనొద్దు: ఇరాన్**

కాగా.. ఈ స్పీర్ ప్లా ఐఆర్జీసీ అధికార ప్రతినిధి స్పందిస్తూ అమెరికాపై విమర్శలు గుప్పించారు. ''మీ ఓటమిని శాంతి ఒప్పందంగా పిలవొద్దు. ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులను మేం అంగీకరించబోం'' అని ఐఆర్జీసీ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు.

## నేటి నుంచి భద్రాచలంలో బ్రహ్మోత్సవాలు

**భద్రాచలం, మార్చి 25:** భద్రాచలంలో కొలువుదీరిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయంలో గురువారం నుంచి వసంత పక్ష తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా అభిషేకం, ఆరాధన, తిరుమంజన సేవలను నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. స్థానిక తాత గుడి సెంటర్ వద్దనున్న ఆలయంలో భూమి పూజ, వాస్తు పూజ నిర్వహించి ఈ తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అనంతరం ఉగాది ఉత్సవాల సందర్భంగా దేవాలయంలో సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు. 27వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణం నిర్వహించనున్నారు. అలాగే మార్చి 28న శ్రీ రామ మహా పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

# బీసీ హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశం నిర్వహించారు. మరో రెండు నెలల తరవాత నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు చేరే నాటికి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. హాస్టళ్లలోకి దోమలు రాకుండా దోమల నెట్ లు కిటికీలు, ద్వారాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. పరిశుద్ధమైన తాగునీరు అందించడంలో భాగంగా గడువులోగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కొత్తగా ఏర్పాటు చేయబోయే 10 ఎంజేపీ స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో బీసీ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఏ ఒక్క బీసీ బిడ్డ బడి బయట ఉండకూడదన్నారు. ఆదరణ 3.0 పథకం అమలుపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ కార్పొరేషన్ జీఎం భీమశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వాట్సప్ మన మిత్ర ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు

**అమరావతి,మార్చి,25,(మనం ప్రత్యేక ప్రతినిధి):** మన మిత్ర వాట్సాప్ ద్వారా రాష్ట్రంలోని వయో వృద్ధులకు ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందిస్తున్నామని వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖామంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి డా. స్వామి అధ్యక్షతన సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్ 3 వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వయోవృద్ధుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై సమావేశంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... మన మిత్ర వాట్సాప్ ద్వారా ఉచితంగా సీనియర్ సిటిజన్ కార్డులు అందజేస్తున్నాం. అర్హులైన వారందరికీ ఈ కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. సైబర్ నేరాల పట్ల వృద్ధులకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.
వృద్ధాశ్రమాల్లో లైట్ వెయిట్ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలి. ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు రాయితీ, సీట్ల కేటాయింపు పటిష్టంగా అమలు చేయాలి. వృద్ధులు, దివ్యాంగుల కోసం కలెక్టర్ కార్యాలయాల్లో లిఫ్ట్ సౌకర్యంతో పాటు వీల్ చైర్లు ఏర్పాటు చేస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగులకు దేశంలో ఎక్కడా లేనివిధంగా పెద్ద మొత్తంలో పించన్లు ఇస్తున్నాం. 2036 నాటికి రాష్ట్రంలో ప్రతి 5 మందిలో ఒకరు వృద్ధుడు ఉంటారు. దీన్ని అధిగమించేందుకే సీఎం చంద్రబాబు నాయుడు పాపులేషన్ మేనేజ్ మెంట్ పాలసీకి శ్రీకారం చుడుతున్నారు. వృద్ధుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ సూర్యకుమారి, డైరెక్టర్ రవి ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్ నుంచి విలువైన బహుమతి అందిందన్న ట్రంప్..

హర్మూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ నుంచి తమకు చాలా పెద్ద బహుమతి లభించిందని ట్రంప్ వెల్లడించారు. మంగళవారం వైట్ హౌస్ లో విలేకరులతో మాట్లాడుతూ.. ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. వారు(ఇరాన్ నేతలు) ఒక అద్భుతమైన పని చేశారు. మాకు ఒక బహుమతి ఇచ్చారు. ఈరోజే అది మాకు చేరింది. అది చాలా పెద్దది. దాని విలువ అపారమైనది' అని ట్రంప్ అన్నారు. అది అణు సంబంధమైనది కాదని.. చమురు, గ్యాస్తో ముడిపడినదని చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలను మాత్రం ఆయన వెల్లడించలేదు. ఆ దేశంలోని సరైన వ్యక్తులతోనే తాము చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు.

## భూ సమస్యలపై సత్వర చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఖాజావలి చెప్పారు. జిల్లా పాలనా యంత్రాంగంలో భాగంగా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవలతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ లో బుధవారం తనను కలిసిన మనం ప్రత్యేక ప్రతినిధితో. డిఆర్వో ఖాజావలి మాట్లాడుతూ, కలెక్టరేట్ కార్యకలాపాలను పర్యవేక్షించడమే కాకుండా, భూమి సమస్యలు, ప్రోటోకాల్ సంబంధిత అంశాలను శ్రద్ధగా పర్యవేక్షిస్తున్నామన్నారు. రెవిన్యూ, భూ సమస్యల పరిష్కారానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కృత నిశ్చయంతో ఉన్నారని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తమకు సూచనలు ఉన్నాయని తెలిపారు. బాధితులు ఎవరైనా నేరుగా కలెక్టర్ కి, జాయింట్ కలెక్టర్లకు తమ ఫిర్యాదులు అందించాలని ఖాజావలి సూచించారు.

# ఆంధ్రాలో ప్రకాశిస్తున్న పీఎం సూర్య ఘర్

**కంచికచర్ల, మార్చి 25 (మనం న్యూస్):** దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్జీ ఎంబీవై) పథకం ఆంధ్రప్రదేశ్లో ప్రకాశిస్తోంది. పథకం వేగంగా అమలు జరుగుతోంది. ఈ విషయాన్ని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ లోక్ సభలో వెల్లడించారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం పురోగతిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో పాటుగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' (పీఎంఎస్జీ ఎంబీవై ) పథకం ద్వారా దేశవ్యాప్తంగా 32 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 66.48 లక్షల దరఖాస్తులు రాగా, 26.20 లక్షల ఇన్స్టాలేషన్లు పూర్తయ్యాయని దీనివల్ల మొత్తం 32,40,068 కుటుంబాలు ప్రయోజనం పొందాయని తెలిపారు. ఈ పథకం అమలుకు కేంద్రం ఇప్పటివరకు రూ. 17,967.46 కోట్ల సబ్సిడీని విడుదల చేసిందని మంత్రి పేర్కొన్నారు . అదే విధంగా ఆంధ్ర ప్రదేశ్లో ఇప్పటివరకు 1,14,313 గృహాలపై సోలార్ విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు మంత్రి శ్రీపాద్ యశో నాయక్ తెలిపారు.

2024 ఫిబ్రవరి నుంచి ఆంధ్రప్రదేశ్లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం ప్రారంభమైందని, పథకం ప్రారంభం నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు . ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 32,40,068 ధరఖాస్తులు రాగా రాష్ట్రంలో మొత్తం 14,72,814 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. వీటిలో 1,14,313 దరఖాస్తులకు సంబంధించి ఇన్స్టాలేషన్లు ఇప్పటికే పూర్తయినట్లు మంత్రి తెలిపారు. తద్వారా 1,17,453 కుటుంబాలకు రాష్ట్రంలో లబ్ధి చేకూరిందనీ, ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 734.97 కోట్లను ఆర్థిక సహాయం (సబ్సిడీ) రూపంలో ఈ ఏడాది మార్చి 20 నాటికి నేరుగా పంపిణీ చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన' పథకం అమలు పురోగతిని జిల్లాల వారీగా పరిశీలిస్తే పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 1,62,506 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

# చమురు నౌకల రక్షణ కోసం ఆపరేషన్ ఊర్జా సురక్షా చేపట్టిన నేవీ

(మొదటి పేజీ తరువాయి)

నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు నౌకలు జలసంధి దాటేవరకు అనుక్షణం వాటికి సహాయసహకారాలు అందిస్తోంది. హర్మూజ్ దాటిన తర్వాత ఈ నౌకలు గల్ఫ్ ఆఫ్ ఒమన్లోకి ప్రవేశించి అక్కడినుంచి అరేబియా సముద్రంలోకి వస్తాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల వద్ద భారత నేవీ 5 యుద్ధ నౌకలను మోహరించింది. ఈ ఆపరేషన్ కారణంగానే ఇటీవల రెండు గ్యాస్ ట్యాంకర్లు భారత్‌కు చేరుకోగలిగాయి. ప్రస్తుతం హర్మూజ్ వద్ద 22 వరకు ఎల్పీజీ, ఎల్ఎన్జీ, క్రూడ్ ఆయిల్ రవాణా నౌకలు భారత్‌కు రావడానికి రెడీగా ఉన్నాయి.

**సీమైన్స్ బారిన పడకుండా కాపాడుతూ..**

సాధారణంగా సముద్రంలో ప్రయాణం హైడ్రోగ్రాఫిక్ చార్టులు, నావిగేషన్ వ్యవస్థల ఆధారంగా ఉంటుంది.

ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సీమైన్స్‌ను అమర్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిల్లో చాలావరకు బయటకు కన్పించవు.

వీటి కారణంగా నౌకలకు తీవ్ర ముప్పు పొంచి ఉంటుంది. అందుకే, ఈ సీమైన్స్ తగలకుండా నౌకలను హర్మూజ్ను దాటించడం అత్యంత ఆవశ్యకం. దీన్ని గుర్తించిన భారత నేవీ.. మన నౌకల కోసం ప్రత్యేక హైడ్రోగ్రాఫిక్ చార్టులను రూపొందిస్తోంది. నిఘా నౌకలతో సముద్ర గర్భాన్ని స్కాన్ చేసి నావిగేషన్ రూట్లను గుర్తిస్తోంది. ఆయా మార్గాలను నౌకలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వాటిని హర్మూజ్ నుంచి తీసుకొస్తోంది.

## యుద్ధం వల్ల ఆహార భద్రతకు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హర్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే.. యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది.యుద్ధం మొదలై కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వ లు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్జీని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది.

# గరుడ వారధి పై భారీ వాహనాలకు అనుమతి లేదు

- గరుడ వారిది పై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి
- రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఆంక్షలు కఠినతరం చేయాలి
- జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**తిరుపతి, మార్చి 25, మనం న్యూస్ :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.

బుధవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ రవి మనోహరచారి, తిరుపతి, చెన్నై, నెల్లూరు నేషనల్ హైవే పిడి లు వెంకటేశ్వర్లు, రవీంద్ర రావు, చౌదరి, జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, ఆర్ అండ్ బి ఎస్ఇ రాజా నాయక్ తో కలిసి జిల్లాస్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలను పాటించేలా అవగాహన కల్పించడం వలన జిల్లాలో ప్రమాదాలలో మరణాల సంఖ్యను తగ్గించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే రహదారుల బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్స్ నందు ఇంజనీరింగ్ పనులు పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. ప్రతి రహదారుల నియమాలు పాటించేలా అవగాహన పెంచి రోడ్డు ప్రమాద నివారణ దిశగా కృషి చేయాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణించే ప్రయాణకులకు రహదారుల ప్రాంతాలలో రెస్ట్ రూములు ఉండేలా చూడాలన్నారు. గంజాయి మరియు మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాల పై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వ్యతిరేక క్లబ్లు (ఈగల్ ) ఏర్పాటు అవగాహన కల్పించాలన్నారు. వ్యతిరేక క్లబ్లు (ఈగల్ ) ఏర్పాటుకు విద్యాశాఖ అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన వారికి అత్యవసర చికిత్స నిమిత్తం ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లా ఎస్పి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రధానంగా బ్లాక్ స్పాట్లు, ప్రమాద అవకాశం గల 83 ప్రాంతాలు గుర్తించడం జరిగిందని, బ్లాక్ స్పాట్ ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం కోసం నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల నివారణ దిశగా వాటి రవాణా తయారీ పై ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని తెలిపారు. అన్ని విద్యా సంస్థలలో ఎన్ఫోర్స్మెంట్ తనిఖీలు ఉండేలా చూడాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే ఈగల్ క్లబ్బులు నిరంతరాయంగా ఉండేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, డిఎస్పి లు, నేషనల్ హైవే అధికారులు, డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# తిరుమలలో సింహ నిలయం అతిథి గృహం ప్రారంభం

**తిరుమల, మార్చి 25,మనం న్యూస్ :** తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం సమీపంలో సెల్ కాన్ ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నూతనంగా నిర్మించిన సింహ నిలయం అతిథి గృహాన్ని బుధవారం ఉదయం టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ నూతన కాటేజీ డొనేషన్ పాలసీ ద్వారా సెల్ కాన్ సంస్థ నూతనంగా అతిథి గృహాన్ని నిర్మించి టీటీడీకి అప్పగించిందని చెప్పారు. ఈ పాలసీ ద్వారా దాదాపు 24 అతిథి గృహాలను దాతల ద్వారా నిర్మించేందుకు అనుమతించడం జరిగిందన్నారు. అందులో ఇప్పటి వరకు 16 అతిథి గృహాలను దాతలు నిర్మించి టీటీడీకి అప్పగించినట్లు చెప్పారు. తద్వారా దాదాపు 200 రూములు అదనంగా భక్తులకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. యాత్రికుల వసతి సముదాయం-1 ను కూడా ఆత్యాధునిక సౌకర్యాలతో ఆధునీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో అన్ని వర్గాలకు చెందిన భక్తులకు తిరుమలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసెప్షన్ డిప్యూటీ ఈవో భాస్కర్, సెల్ కాన్ సంస్థ సీఎండీ గురుస్వామి నాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాపూరు - పెంచలకొన మార్గం లో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



- ఇద్దరు స్మగ్లర్లు అరెస్టు

**తిరుపతి,మార్చి 25, మనం న్యూస్ :** నెల్లూరు జిల్లా రాపూరు - పెంచల కోన మార్గంలో 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో ఏఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో డీఎస్పీ ఎండీ షరీఫ్ మార్గ నిర్దేశకత్వంలో రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ ఎన్ బాల చెన్నయ్య టీమ్ స్థానిక ఎఫ్బీఓ జాన్ రంజిత్ కుమార్ తో కలసి మంగళవారం నుంచి నెల్లూరు జిల్లా రాపూరు మండలం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున పెంచలకోన రోడ్డులో ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వారు టాస్క్ ఫోర్స్ సిబ్బంది ని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే టాస్క్ ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని రాపూరు మండలానికి చెందిన వారి గా గుర్తించారు. వారిని విచారించి, పరిసరాల్లో అక్రమ రవాణాకు సిద్ధంగా 13ఎర్రచందనం దుంగలు కనుగొన్నారు. మరో మోటారు సైకిల్ తో పాటు అరెస్టయిన వారిని ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించారు. డీఎస్పీ వీ శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ జె. శ్రీనివాస్ వీరిని విచారించారు. తరువాత ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.



# కపిలతీర్థంలో కోదండరాముడి చక్రస్నానం

## భక్తి వైభవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**తిరుపతి,మార్చి 25,మనం న్యూస్ :** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన బుధవారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో నిర్వహించిన చక్రస్నానం ఎంతో వైభవంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకను దర్శించేందుకు విశేష సంఖ్యలో భక్తులు హాజరై పుణ్యస్నానాలు ఆచరించారు.

ముందుగా ఉదయం 7.30 గంటలకు శ్రీ లక్ష్మణ సమేత సీతారాములవారు పల్లకిలో కపిలతీర్థానికి వేంచేశారు. అనంతరం ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయ మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సీతారామలక్ష్మణులతో పాటు చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు స్వీకరించి భక్తులకు కటాక్షం ప్రసాదించారు. అనంతరం అర్చకులు వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు.

అనంతరం ఉదయం 11 గంటలకు స్వామివారు ఆళ్వార్ తీర్థం నుండి పి.ఆర్. తోటకు వేంచేశారు. సాయంత్రం అక్కడి నుండి బయలుదేరి తీర్థకట్ట వీధి, కోటకొమ్మల వీధి, కొత్తవీధి మీదుగా తిరిగి శ్రీ కోదండరామాలయానికి చేరుకుంటారు. మధ్యలో శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం, శ్రీవైఖానసాచార్యుల ఆలయంలో ఆస్థానం నిర్వహించనున్నారు.

రాత్రి 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించే ధ్వజావరోహణ ఉత్సవంతో శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి వైభవంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు మరియు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఒంటిమిట్టలో భక్తి వాతావరణంలో హరిద్రా ఘటనం

## శ్రీ సీతారాముల కళ్యాణోత్సవానికి శుభారంభం

**ఒంటిమిట్ట/తిరుపతి, మార్చి 26 :** కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి.

ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

**ప్రాధాన్యం :**

హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు.

**కార్యక్రమం విధానం :**

ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు.

పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, డీఈ (ఎలక్ట్రికల్) సరస్వతి, పీఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేశ భవిష్యత్తుకు అవసరమైన యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకుందాం

- వారం రోజులు లోపు జిల్లాలోని 25 జడ్పీ హైస్కూల్ పరిసర ప్రాంతాలలో
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలి : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్
- డ్రగ్స్ నియంత్రణకు రానున్న కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేస్తాం : ఎస్ పి తుషార్ దూడి

**చిత్తూరు, మార్చి 25,మనం న్యూస్ :** దేశ భవిష్యత్తుకు అవసరమైన యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుకుందామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు - అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ తుషార్ దూడి తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్లస్టర్ స్థాయిలో ఆర్డీవోలు, డీఎస్పీలు ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్ నందు మాదక ద్రవ్య రహితం పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. యువత ను డ్రగ్స్ కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు జూనియర్ కాలేజీలు, కళాశాలలో యువత మత్తు పదార్థాలకు బానిస కావడం ద్వారా ఎదుర్కొనే చట్ట పరమైన అనేక సమస్యల గురించి విస్తృతంగా అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు. డ్రగ్స్ నియంత్రణకు పని చేసే స్వచ్ఛంద సంస్థలను కూడా ఇందులో భాగ స్వామ్యం చేయాలని తెలిపారు.

# ఎస్సీ, ఎస్టీల సమస్యలపై జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం

- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ మరియు కమిటీ చైర్పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్



**తిరుపతి, మార్చి 25,మనం న్యూస్ :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీల కు సంబంధించిన సమస్యల పట్ల స్వయంగా తనిఖీ చేసి తక్షణమే పరిష్కారం చూపుతూ నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ చైర్పర్సన్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.

బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, సత్యవేడు మరియు సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కోనేటి ఆదిమూలం, నెలవల విజయశ్రీ లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై ఆయా శాఖల సమాధానాలను పరిశీలించిన అనంతరం, జాప్యం జరిగిన అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న అట్రాసిటీ కేసులు త్వరితంగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు.డీవీఎంసీ లో ప్రస్తావించే ప్రతి అంశానికి అధికారులు పరిష్కారం చూపాల్సిన భాధ్యత ఉందని, సివిల్ రైట్స్ డే ప్రతి నెలా జరిపి ఎస్సీ/ఎస్టీ సమస్యలకు పరిష్కారం చూపాలని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపేలా న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

# ఫ్యాంటసీ, కామెడీతో నిండిన సినిమా రాకాసా

- నిర్మాత కొణిదెల నీహారిక



**తిరుపతి,మార్చి 25,మనం న్యూస్ :** రెండున్నర గంటల పాటు ఫ్యాంటసీ, కామెడి ప్రపంచంలో సినిమా చూసేలా రాకాసా సినిమా తీసామని ప్రొడ్యూసర్ కొణిదెల నిహారిక అన్నారు. తిరుపతిలో బుధవారం రాకాసా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పాటు సినిమాను తీసామని డైరెక్టర్ మనస శర్మ చాల చక్కగా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రాన్ని అందించారు. అవకాశం వస్తే కొణిదెల కుటుంబంలోని హీరోలతో సినిమాలు తీయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. కామెడీ యాక్టర్ శ్రీను మాట్లాడుతూ మంచి సినిమాకు ప్రేక్షకులు ఎప్పుడు బ్రహ్మరథం పడుతారని తమ సినిమా రాకాసా కూడా బ్లాక్ బస్టర్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో సంగీత్ శోభన్ మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీన విడుదల కానున్న సినిమాను ప్రేక్షక మహాశయులు ఆదరించాలని కోరారు. హీరోయిన్ నయాన్ సరిక మాట్లాడుతూ.. నెల రోజుల్లో మూడో సారి తిరుపతికి వచ్చానని.. అది స్వామి వారి దయ అన్నారు. కంటెంట్ పరంగా ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చిందని బుధవారం సాయంత్రం విడుదల కానున్న ట్రైలర్ తో పాటు సినిమాను ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లకు వచ్చి చూడాలని కోరారు.

# బుచ్చయ్య పేటలో బహిర్గతమైన వర్గ విభేదాలు.!?

## నిలిచిన రహదారి పనులు!

**బుచ్చయ్యపేట మార్చి 25 (మనం న్యూస్) :** మొన్నటి వరకు గుర్తు చప్పుడుగా ఉన్న వర్గ విభేదాలు రహదారి నిర్మాణం పనుల పేరుతో బహిర్గతమయ్యాయి. చోడవరం ఎమ్మెల్యే వర్గ విభేదాలకు ప్రాధాన్యతీస్తున్నారని ఒక వర్గానికి ప్రాధాన్యతిస్తూ మరో వర్గాన్ని పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిన్నటి వరకు లోల లోపల ఉన్న వర్గ పోరు గురువారం రోడ్డుపై బైఠాయించడంతో బహిర్గతమయింది. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామంలో సుమారు 55 లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణ పనులు కు కూటమినేతలు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన విషయం తెలిసిందే అయితే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అయిన బత్తుల తాతయ్య బాబు కు చెందిన నాయకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పనులు ప్రారంభించడం పట్ల బుధవారం తాతయ్య బాబు వర్గీయులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తమ ఫోన్లకు స్పందించడం లేదని వర్గ విభేదాలను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే వద్దకు వెళ్లడానికి తాము సిద్ధమని మిగతా వర్గం కూడా వస్తే ఎమ్మెల్యే దగ్గరే పంచాయతీ తేల్చుకుందామని అంతవరకు పనులు జరగడానికి వీలు లేదని రోడ్డుపై బైఠాయించి పనులను అడ్డుకోవడం జరిగింది.

## యుద్ధం

ఎవరి కోసం ఎందు కోసం
ఏమి ఆశించి ఈ రణం
యుద్ధం అంటే ఏమిటో
తెలియని పసిప్రాణాలతో చెలగాటమా
గర్భాన్ని చీల్చి పిండాన్ని చంపడమా
ఆసుపత్రిలో ఆయువుతో పోరాడే వారిపై
అణుబాంబులో ముక్తి ప్రసాదించడమా
ఆధిపత్యపోరులో అమాయకులు బలికావడమా
సాంకేతిక పరిజ్ఞానం ప్రగతికా ప్రాణాలు
తీయడానికా
మైనపు వొత్తుల్లా కాలిపోతూ
గాజుబొమ్మల్లా పగిలిపోతున్న దేహాలు
బతకాలనే ఆశతో క్షణక్షణం
భయంతో చస్తున్న జీవులు
శిథిలాలను చూస్తూ ఛిద్రమవుతున్న శాపగ్రస్థులు
తన వారి మృతదేహాల కోసం రక్తాశ్రువులు
చిందిస్తూ
వెతుకులాడుతున్న జీవచ్ఛవాలు
ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక
రక్షించే దైవం కానరాక
బతకడం కంటే చావే నయమనే నిర్వేదంలో
దిక్కుతోచన్న పక్షుల్లా
అరణ్య రోదనలైన ఆక్రందనలు
గాలిలో దీపంలా అల్లాడుతున్న ప్రాణులు
ఏమైపోతుందీ ప్రపంచం
ఎక్కడ దాక్కుందో మానవత్వం
సహృదయతకు సరిహద్దులేమిటి


యుద్ధం రెండు దేశాలకైతే
మరణించిన జనాలు ఆ దేశాలవే
కానీ శోకం మాత్రం ప్రపంచానిదే
అందుకే నీవూ నేనూ గొంతుకలిపి
'అహింసా పరమో ధర్మః 'అని
మన నినాదాన్ని గట్టిగా వినిపిద్దాం
ఒక్కోచేయి కలుపుదాం
ఒక్కో అడుగు ముందుకువేద్దాం
విశ్వశాంతికి జీవం పోసి శాంతికపోతాలు
ఎగరేసే మహానుభావులకు స్వాగతం పలుకుదాం

**- సురేంద్ర రొడ్డ**
9491523570

# దక్షిణ భారతంపై డీలిమిటేషన్ కత్తి!



ప్రస్తుతం తమిళనాడు సిఎం స్టాలిన్ జాతీయ హిందీ భాషను బలవంతంగా దక్షిణ భారత రాష్ట్రాలపై రుద్దడం వల్ల స్థానిక భాషలు అంతరిస్తాయని, హిందీని తప్పనిసరి చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం చూస్తున్నాం. దీనికి తోడుగా 2026లో చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రయోగం పూర్తి అయితే దక్షిణ భారతంతో పోల్చితే ఉత్తర భారతంలో పార్లమెంట్/అసెంబ్లీ స్థానాలు భారీగా పెరుగుతాయనే ఆందోళనలో దక్షిణ భారత పార్టీలు, పౌర సమాజం మునిగి పోతున్నది. ఎక్కడ చూసినా డీలిమిటేషన్ చర్చ జరుగుతున్నది. డీలిమిటేషన్ అమలు చేస్తే జనాభా ప్రాతిపదిక కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తర భారతంలో ఎంపీ సీట్లు అతిగా పెరగడం, కుటుంబ నియంత్రణతో జనాభా పెరుగుదలను అదుపులో పెట్టుకున్న దక్షిణ భారత రాష్ట్రాల్లో ఎంపీ/ఎంఎల్ఏ సీట్లు తగ్గడం జరగవచ్చనే అనుమానాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా కొట్టిపారేసినప్పటికీ దక్షిణ భారతం దీని పట్ల పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.



### డీలిమిటేషన్ అంటే ఏమిటి ?

ప్రతి పదేళ్లకు ఒకసారి జనగనణ తర్వాత జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, నియోజకవర్గ ప్రాంతాలను పునర్విభజన చేసే ప్రక్రియను డీలిమిటేషన్ అని పిలుస్తున్నాం. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు అధిక నియోజక వర్గాలు, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలకు తక్కువ స్థానాలు కేటాయించడం జరుగుతూ వస్తున్నది. డీలిమిటేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ స్థానాలు కూడా పునర్ నిర్వచించబడతాయని తెలుసుకోవాలి. రాజ్యాంగంలోకి ఆర్టికల్ 82, 170 ప్రకారం, పార్లమెంట్‌లో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే స్వయం ప్రతిపత్తిగల డీలిమిటేషన్ కమీషన్ ద్వారా ప్రతి జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేయడం జరుగుతుంది. ఇప్పటి వరకు 1951, 1961, 1971లలో జనగణన వరుసగా 36.1 కోట్లు, 43.9 కోట్లు, 54.8 కోట్ల జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేయడంతో పార్లమెంట్ స్థానాలు 494, 522, మరియు 543 వరకు పెంచడం జరిగింది.

1976లో కుటుంబ నియంత్రణ అమలును పెద్ద ఎత్తున చేపట్టిన నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్ల వరకు పొడిగించడం జరిగింది. జనాభా నియంత్రించని రాష్ట్రాలకు అధిక నియోజకవర్గాలు కేటాయించాల్సి వస్తుందనే కారణంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణతో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్ల వరకు, అనగా 2000 వరకు పొడిగించడం జరగడం చూసాం. 2001 సంవత్సరంలో 84వ, 2003లో 87వ రాజ్యాంగ సవరణతో తిరిగి మరో సారి డీలిమిటేషన్ ఎక్సర్‌సైజ్‌ను మరో 25 ఏండ్ల వరకు, అనగా 2026 వరకు పొడిగించారు. అనగా 1971 తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియను 50 ఏండ్ల వరకు పొడిగించడం జరిగిందని తెలుసుకోవాలి. 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయితే 141 కోట్ల జనాభాకు పార్లమెంట్ స్థానాల సంఖ్య 50 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలు 816 వరకు పెరగనున్నాయి. అదే విధంగా దేశవ్యాప్తంగా ఉన్న 4,123 ఎంఎల్ఏ స్థానాల సంఖ్య 6,185 వరకు చేరనున్నాయి. ఇప్పుడు ఉన్న ఎంపీ స్థానాల కన్న 273 స్థానాలు పెరుగుతాయని, ఇవి కుటుంబ నియంత్రణ పాటించని అధిక జనాభా కలిగిన యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు అధికంగా పెరగవచ్చని దక్షిణ భారతం భయపడుతున్నది.

కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలను డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని సౌత్ ఇండియా గళం పెంచడం సముచితంగా, సమర్థనీ యంగా కనిపిస్తున్నది. 2026లో జనగణన చేపడితే 2031 వరకు పూర్తి కావడం, ఆ తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియ అమలు చేయడం జరగవచ్చు. దీనితో పాటు మహిళలకు 33 శాతం ఎంపీ స్థానాలు, అనగా 273 స్థానాలు కేటాయించడంతో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది.

### డీలిమిటేషన్‌పై దక్షిణ భారత అభ్యంతరాలు ఏమిటి ?

తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలో ఎంపీ స్థానాలు 25 లేదా 26 వరకు, ఎంఎల్ఏ స్థానాలు 178 లేదా 179 వరకు చేరవచ్చు. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో ఎంపీ స్థానాలు 37 లేదా 38 వరకు, శాసనసభ స్థానాలు 262 లేదా 263 వరకు పెరగనున్నట్లు అర్థం అవుతున్నది. ప్రస్తుతం దక్షిణ భారతంలో 24 శాతం అనగా 129 ఎంపీ స్థానాలు (543 మొత్తం స్థానాలు) ఉన్నాయి. తెలంగాణలో 17, ఏపీలో 25, కేరళలో 20, తమిళనాడులో 39, కర్నాటకలో 28 ఏంపీ స్థానాలు ఉన్నాయి. ప్రతి ఎంపీ స్థానానికి 20 లక్షల జనాభాను నిర్ణయించి 2026లో డీలిమిటేషన్ చేసిన యెడల తెలంగాణలో 17 నుంచి 25/26, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 37/38, కేరళలో 19 నుంచి 30, కర్నాటకలో 28 నుంచి 42 సీట్ల వరకు, మహారాష్ట్రాలో 48 నుంచి 72 వరకు, తమిళనాడులో 39 నుంచి 59, ఛత్తీస్‌గఢ్‌లో 17 నుంచి 26, గుజరాత్‌లో 26 నుంచి 39, ఒడిసాలో 21 నుంచి 32, ఝార్ఖండ్‌లో 14 నుంచి 21, బెంగాల్లో 42 నుంచి 63, రాజస్థాన్‌లో 25 నుంచి 38, ఢిల్లీలో 7 నుంచి 11, జమ్ము కాశ్మీర్‌లో 5 నుంచి 8 వరకు, అస్సాంలో 14 నుంచి 21 ఎంపీ స్థానాలు పెరగవచ్చు. 2026 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ అమలు అయితే యూపీలో ఎంపీ స్థానాలు ప్రస్తుత 80 నుంచి 120 వరకు, బీహార్‌లో 40 నుంచి 60, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 44 వరకు, రాజస్థాన్‌లో 25 నుంచి 38 వరకు నియోజకవర్గాలు పెరుగుతాయి. ఈశాన్య చిన్న రాష్ట్రాల్లో ఇప్పుడు ఉన్న ఎంపీ స్థానాలు ఒక్కొక్కటి చొప్పున మాత్రమే పెరగడం జరుగుతుంది. దక్షిణ భారతంలో ఎంపీ స్థానాలు 129 నుంచి 144 వరకు, అనగా అతి కొద్ది సీట్లు మాత్రమే పెరుగుతాయని దక్షిణ భారతం ఆందోళన చెందుతున్నది. దేశవ్యాప్త 816 ఎంపీ స్థానాల్లో 20 శాతం వరకు నియోజకవర్గాలు మాత్రమే దక్షిణాది రాష్ట్రాల్లో పెరగడం జరగవచ్చు.

దక్షిణాది ఐదు రాష్ట్రాల్లో (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక) ఎంపీ స్థానాలు 129 నుంచి 195 వరకు పెరిగి 66 సీట్లు అధికంగా వస్తాయి. అదే విధంగా ఉత్తర భారత 4 రాష్ట్రాల్లో (యూపీ, బీహార్, రాజస్థాన్, ఎంపీ) ఉన్న 174 సీట్లు డీలిమిటేషన్ తర్వాత 262 వరకు పెరిగి 88 సీట్లు అధికంగా రానున్నాయి. జనాభాను నియంత్రించిన పుణ్యానికి బహుమతిగా దక్షిణాదికి ఎంపీ సీట్లు తగ్గడం, జనాభాను అదుపు చేయని ఉత్తర భారతానికి అధిక ఎంపీ సీట్లు కేటాయించడం జరిగితే దక్షిణ - ఉత్తర భారతాల మధ్య విభేదాలు పెరగడం.. దక్షిణ భారతాన్ని ఒక దేశంగా విభజించాలని ప్రతిపాదనలు కూడా బలపడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశాభివృద్ధిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న దక్షిణాది మెడపై డీలిమిటేషన్ కత్తి చూపితే రెండు ప్రాంతాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తడం అనివార్యమవుతుంది. దేశ హితం కోరే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడానికి బదులు డీలిమిటేషన్ వేదికగా అన్యాయం చేయడం విచారకరం. అభ్యంతరకరం అని విశ్లేషకులు భావిస్తున్నారు.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# సమాజం అవినీతిని అంగీకరిస్తోందా?



అవినీతి అంటే అధికారాన్ని, పదవిని లేదా బాధ్యతను వ్యక్తిగత లాభం కోసం దుర్వినియోగం చేయడం. సాధారణంగా ఇది చట్టవిరుద్ధం.నైతికంగా తప్పు. ప్రభుత్వాధికారి, ఉద్యోగి నాయకుడు.. నమ్మకస్థానంలో ఉన్న వ్యక్తి ప్రజలకు న్యాయంగా సేవ చేయకుండా తనకు ప్రయోజనం కలిగేలా వ్యవహరించినప్పుడు అవినీతి జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో అవినీతి సాధారణంగా మారుతోంది. ధనికదేశాలు గానీ, పేద దేశాలలో అవినీతి రూపాలు, స్థాయి దేశానికొకలా ఉన్నప్పటికీ, దాని మూలకారణాలు ప్రపంచ వ్యాప్తంగా ఒకేలా ఉన్నాయి. ఉదాహరణకు, రష్యాలో రాజకీయశక్తి, వ్యాపార ప్రయోజనాల మధ్య ఉన్న సంబంధాలు, మయన్మార్‌లో సైనిక ఆధిపత్యం, భారత్‌లో భూమి, నిర్మాణం, అనుమతుల ప్రక్రియ, నైజీరియాలో సాధారణ సేవల కోసం అనధికారిక చెల్లింపులు జరుగుతాయి. బంగ్లాదేశ్, కెన్యాలో తక్కువ జీతాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, అమెరికా, బ్రెజిల్లో ఎన్నికల ఖర్చులు ఎక్కువగా ఉండడం వల్ల రాజకీయ నాయకులు పెద్ద దాతలపై ఆధారపడుతూ, తర్వాత వారికి అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం మొదలయినవి. అవినీతి ఘటనల్లో కనిపించింది.

స్విట్జర్లాండ్ పనామా వంటి దేశాల్లో అంతర్జాతీయంగా అక్రమ డబ్బును దాచుకోవడం సులభమైంది, యుద్ధాలు, ప్రకృతి విపత్తులు మరియు అత్యవసర ఖర్చులు కూడా పర్యవేక్షణను బలహీనపరుస్తాయి. ఉదాహరణకు.. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో అత్యవసర కొనుగోళ్లలో అవినీతి అనుమానాలు ఉన్నాయి, హైతీలో విపత్తు సహాయ నిధుల దుర్వినియోగం జరిగింది. ఈ అంశాలు కలిసి అవినీతిని ప్రపంచవ్యాప్త సమ స్యగా మారుస్తున్నాయి. ప్రపంచ బ్యాంక్ ప్రకారం, అవినీతి వ్యాపారాలపై అదనపు పన్నులా పని చేస్తుంది, దీని వల్ల సామర్థ్యం, ఆవిష్కరణ తగ్గు తాయి. ఇది ప్రజావనరుల కోసం కేటాయించిన నిధులు వ్యక్తిగత లాభాల కోసం మళ్లించ బడతాయి. ఫలితంగా మౌలిక వసతులు బలహీన పడతాయి. పేదరికం, అసమానతలను కూడా పెంచుతుంది, ద్రవ్యోల్బణం, నల్లధన ఆర్థిక వ్యవ స్థను ప్రోత్సహిస్తుంది. చివరికి, ఇది ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసి, ప్రజాస్వామ్య స్థిరత్వానికి ముప్పు కలిగిస్తుంది.

ప్రపంచవ్యాప్తంగా అవినీతిని పర్యవేక్షించడానికి, మంచి పాలనను ప్రోత్సహించడానికి అనేక అంతర్జాతీయ సంస్థలు పనిచేస్తున్నాయి. ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ ప్రచురించే కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్, ప్రపంచ బ్యాంక్ రూపొందించే వరల్డ్‌వైల్డ్ గవర్నెన్స్ ఇండికేటర్స్, యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్, ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ, ఆసియా అభివృద్ధి బ్యాంక్, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్రికా, యూరోపియన్ కమిషన్ యూరోపియన్ యూనియన్, వంటి సంస్థలు అవినీతి కొలిచే, బాధ్యతాయుత పాలనను ప్రోత్సహించే మరియు సంస్కరణలను ప్రేరేపించే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ ప్రచురించిన కరప్షన్ పర్సెప్షన్స్ ఇండెక్స్ ప్రకారం, డెన్మార్క్, ఫిన్లాండ్, సింగపూర్,న్యూజిలాండ్,నార్వే వంటి దేశాలు పారదర్శకత, బలమైన సంస్థలు, కఠినమైన చట్ట అమలు వల్ల అత్యల్ప అవినీతి దేశాలుగా నిలుస్తాయి. వీటిలో ప్రజా బాధ్యతాయుతం, చట్ట పరి పాలనకు అధిక ప్రాధాన్యం ఉంటుంది.

మరోవైపు, దక్షిణసూడాన్, సోమాలియా, వెనిజులా, సిరియా, యెమెన్ వంటి దేశాలు రాజకీయ అస్థిరత, బలహీన పాలన దీర్ఘకాలిక ఘర్షణల కారణంగా అత్యధిక అవినీతిని ఎదుర్కొంటున్నాయి.

ట్రాన్సపరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన 2025 అవినీతి అవగాహన సూచిక ప్రకారం, 182 దేశాలలో భారతదేశం 91వ స్థానంలో ఉంది. భారతదేశంలో ఉన్నత స్థాయి అధికారుల్లో అవినీతి పలు నిర్మాణాత్మక సంస్థాగత కారణాల వల్ల ఏర్పడుతుంది. ముఖ్యంగా రాజకీయ ఒత్తిడి ఒక ప్రధాన కారణం.




రాజకీయ నాయకులు, కాంట్రా క్టర్లు లేదా వ్యాపారాలకు అనుకూలంగా పనిచే యాలని అధికారులపై ఒత్తిడి తెస్తారు, ముఖ్యంగా బదిలీలు, పోస్టింగుల విషయంలో. భూసంబంధ పరిపాలన, పోలీసింగ్, లైసెన్సింగ్ కొనుగోలు వంటి రంగాల్లో ఉన్న విస్తృత స్వేచ్ఛా అధికారాలు పర్యవేక్షణ బలహీనంగా ఉన్నప్పుడు దుర్వినియోగానికి దారితీస్తాయి. క్రమశిక్షణా చర్యల్లో ఆలస్యం, క్లిష్టమైన అనుమతి ప్రక్రియలు శిక్ష భయాన్ని తగ్గించి అవినీతిని నిరోధించే శక్తిని బలహీన పరుస్తాయి. గనులు, మౌలిక వసతులు రియల్ ఎస్టేట్ రంగాల్లో రాజకీయ నాయకులు, వ్యాపారులు అధికారుల మధ్య ఉన్న సంబంధాలు అక్రమ లాభాల కోసం ప్రవర్తనకు దారితీస్తాయి. కొన్ని సందర్భాల్లో ఉన్నత జీవనశైలి నిర్వహించాలనే సామాజిక ఒత్తిడులు కూడా అనైతిక నిర్ణయాలకు దారితీస్తాయి.

లాభదాయక పోస్టులకు బదిలీలలో పారదర్శకత లేకపోవడం పరిపాలనా ప్రక్రియలలో పరిమిత డిజిటలైజేషన్ అవినీతి అవకాశాలను పెంచుతాయి. కొన్ని ప్రాంతాల్లో స్పీడ్ మనీ అనే సంస్కృతి చిన్న స్థాయి అవినీతిని కొనసాగిస్తుంది. అత్యున్నత స్థాయి అధికారులతో సంబంధం ఉన్న పలు అవినీతి కేసులు భారతదేశంలో పరిపాలనా బాధ్యతపై ఉన్న సవాళ్లను బయటపెట్టాయి. నోయిడా భూ కేటాయింపు కుంభకోణంలో తాజ్ కారిడార్ కేసులో, యమునా నది ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల దుర్వినియోగంలో, అక్రమ గనుల తవ్వకం, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు.

అవినీతి కొనసాగడానికి ఒక ముఖ్య కారణం శిక్షలు తక్కువగా ఉండడం లేదా ఆలస్యంగా అమలవడం, శిక్షల నిర్ధారణ తక్కువగా ఉండటం వల్ల చాలా కేసుల్లో నేరస్తుల విచారణలు, కోర్టు ప్రక్రియలు సంవత్సరాల పాటు కొనసాగుతాయి. దీర్ఘకాలిక విశ్లేషణ ప్రకారం, ప్రపంచంలో నమోదు చేసిన అవినీతి కేసుల్లో కేవలం సుమారు 19% మాత్రమే శిక్షకు దారితీస్తున్నవి. అంటే, నమోదైన అన్ని కేసులను పరిగణనలోకి తీసుకుంటే, దాదాపు ప్రతి 5 కేసుల్లో 1 కేసు మాత్రమే శిక్షతో ముగుస్తుంది. భారతదేశంలో ఇటీవలి సంవత్సరాల్లో దాదాపు 65%-75% వరకు శిక్ష విధింపు (con-viction) రేటు ఉంది. 2022లో 74.59%, 2023లో-71.47%,2024లో- సుమారు 69%. తీర్పు వచ్చే సమయానికి చాలా మంది అధికారులు పదవీ విరమణ పొందుతారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (CBI) సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (CVC) వంటి సంస్థల బలహీన అమలు కూడా సమస్యను పెంచుతుంది. రాజకీయ-బ్యూరోక్రాటిక్ సంబంధాలు అవినీతి అధికారులకు రక్షణ కల్పిస్తాయి. పబ్లిక్ సర్వెంట్స్‌పై కేసులు నమోదు చేయడానికి ముందస్తు అనుమతి అవసరం వంటి క్లిష్ట చట్టపరమైన ప్రక్రియలు కూడా ఆలస్యం కలిగిస్తాయి. అనేక సందర్భాల్లో అక్రమ ఆస్తులు పూర్తిగా స్వాధీనం చేయకపోవడం వల్ల నేరస్తులు లాభాలను కొనసాగిస్తారు.

కఠినంగా వ్యవహరించే అధికారుల కు తగిన రక్షణ లేకపోవడం చట్టాల అసమాన అమలు బాధ్యతను బలహీన పరు స్తుంది. అవినీతి భారతదేశంలో గణనీయమైన ఆర్థిక నష్టాలకు కారణమైంది. దేశ స్థూల దేశీయోత్పత్తి (GDP)లో సుమారు 16.6% వరకు ప్రభావం చూపవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థ సుమారు 4 ట్రిలియన్ డాలర్లకు చేరువవుతున్న నేపథ్యంలో, దీని వల్ల దీర్ఘకాలంలో దాదాపు 56-57 లక్షల కోట్లు నష్టంగా భావించవచ్చు.

గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ నివేదిక ప్రకారం.. 1948 నుండి 2008 మధ్యకాలంలో అవినీతి, పన్ను ఎగవేత, అక్రమ చర్యల వల్ల భారతదేశం సుమారు 462 బిలియన్ డాలర్లను కోల్పో యింది.

భారతదేశంలో అవినీతిని నియంత్రించడానికి బలమైన చట్టపరమైన, సంస్థాగత, పరిపాలనా సంస్కరణలు అవసరం. వేగవంతమైన, ఖచ్చితమైన శిక్షలను నిర్ధారించడానికి ప్రత్యేక అవినీతి నిరోధక ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి, తద్వారా విచారణలు త్వరగా పూర్తవుతాయి. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయడానికి ముందస్తు అనుమతి అవసరాన్ని పరిమితం చేయడం లేదా తొలగించడం ద్వారా ఆలస్యాలను తగ్గించాలి. అక్రమంగా సంపాదించిన ఆస్తులను కఠినంగా స్వాధీనం చేసుకోవడం ద్వారా అవినీతి అధికారుల అక్రమ సంపదను పూర్తిగా కోల్పోయేలా చేయాలి. లోక్‌పాల్, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (CVC), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (CBI) వంటి స్వతంత్ర సంస్థలను బలపరచి, రాజకీయ జోక్యం నుంచి రక్షించాలి. పారదర్శకమైన, నియమాల ఆధారిత బదిలీ, పోస్టింగ్ వ్యవస్థలు రాజకీయ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ-గవర్నెన్స్, డిజిటల్ రికార్డులు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా మానవ జోక్యాన్ని తగ్గించి లంచాలకు అవకాశాలను తగ్గించవచ్చు.

రాజకీయ నిధుల సంస్క రణలు అవసరం. చివరగా, సామాజిక ఆడిట్లు, పౌరుల భాగస్వామ్యం మరియు ప్రభుత్వ ఉద్యో గులకు నైతిక శిక్షణ ద్వారా సమగ్రత అవినీతి పట్ల శూన్య సహన సంస్కృతిని నిర్మించవచ్చు. ఉద్యో గుల సంఘాలు కూడా అవినీతిని నియం త్రించడంలో, నైతిక నాయకత్వాన్ని ప్రోత్సహిం చడం చట్టబద్ధ విచారణలకు సహకరించడం ద్వారా విశ్వసనీయతను ప్రజల నమ్మకాన్ని బలపరుస్తాయి.

ఏదేమైనా అవినీతి ప్రపంచవ్యాప్తంగా, భారత దేశంలో కూడా ఒక ప్రధాన సమస్యగానే కొనసాగుతోంది, అయితే సమాజం దాన్ని పూర్తిగా అంగీకరించదు.

అనేక దేశాల్లో వ్యవస్థాపక లోపాలు, అవగాహన కొరత లేదా అధికారిక ప్రక్రి యల ఆలస్యం కారణంగా చిన్నస్థాయి అవినీతిని కొంతవరకు సహించవచ్చు. భారతదేశంలో అవినీతిని సాధారణంగా విమర్శిస్తారు, కానీ కొన్నిసార్లు రోజువారీ వ్యవహారాల్లో అనధి కారికంగా జరుగుతుంది. ప్రభుత్వాలు, మీడియా, మరియు పౌర సమాజ సంస్థలు అవినీతిని తగ్గించడానికి, పారదర్శకతను పెంపొందించ డానికి కృషి చేస్తున్నాయి. మొత్తానికి, కొన్నిసార్లు సహించబడుతున్నప్పటికీ, ఎక్కువ సమాజాలు అంగీకరించవు.

**- డాక్టర్. పి.ఎస్. చారి**
8309082823

# మతం మారితే హక్కులు పోతాయా?



భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అని గర్వంగా చెప్పుకుంటుంది. రాజ్యాంగం సమానత్వం, న్యాయం, మత స్వేచ్ఛ అనే విలువలను ప్రతిష్ఠాత్మకంగా ప్రకటిస్తుంది. కానీ కిందిస్థాయి వాస్తవం చూస్తే.. ఈ విలువలు అందరికీ సమానంగా అమలవుతున్నాయా అనే ప్రశ్న ప్రతి ఒక్కరికి ఉత్పన్నమవుతుంది. ముఖ్యంగా దళిత క్రైస్తవుల విషయంలో ఈ ప్రశ్న మరింత ఆందోళనగా కనిపిస్తున్నది.

దశాబ్దాలుగా సామాజికంగా అణచివేతకు గురైన దళితులు, అవమానకర పరిస్థితుల నుండి బయటపడటానికి విద్య, గౌరవం కోసం మత మార్పిడిని ఆశ్రయించారు. హిందూ సమాజంలో ఎదురైన అంటరానితనం, వివక్ష, సామాజిక వేరుచేసే పరిస్థితులు వారిని ప్రత్యామ్నాయ మార్గాలవైపు నడిపించాయి. ఈ క్రమంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వారు కూడా తాము ఒక గౌరవప్రదమైన జీవితం పొందుతామని ఆశించారు. అయితే ఇక్కడ కూడా ఒక విషాదకర వాస్తవం కనిపిస్తుంది. పరమతం మారినా, వివక్ష మాత్రం పూర్తిగా తొలగిపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణాల్లో కూడా దళిత క్రైస్తవులు ఇంకా వివక్షకు గురవుతున్న ఘటనలు కనిపిస్తూనే ఉన్నాయి. సమాజంలో సమాన స్థానం దక్కకపోవడం, ఆర్థిక వెనుకబాటుతనం కొనసాగడం వంటి సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి.

ఇలాంటి పరిస్థితుల్లో, ఒక కీలక ప్రశ్న ముందుకు వస్తుంది. మతం మారితే ఒక వ్యక్తి పొందిన హక్కులు ఎందుకు కోల్పోవాలి? భారత రాజ్యాంగం ఈ విషయంపై స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తుంది. ఆర్టికల్ 14 సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 15 మతం, కులం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని పూర్తిగా రద్దు చేస్తుంది. ముఖ్యంగా ఆర్టికల్ 25 ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కల్పిస్తుంది. అయితే వాస్తవంలో ఏమి జరుగుతోంది? ఒక దళితుడు తన మతాన్ని మార్చుకుంటే, అతను పొందుతున్న ఎస్సీ హక్కులు, రిజర్వేషన్లు కోల్పోతాడు. అంటే, మత స్వేచ్ఛను వినియోగించుకున్నందుకు అతను ఒక విధంగా శిక్షించబడుతున్నాడా అనే సందేహం కలుగుతుంది.



ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసింది-పరమతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా కొనసాగ దని. తాజాగా కూడా ఇదే అంశాన్ని కోర్టు ప్రస్తావించడం ద్వారా, చట్టపరంగా ఉన్న పరిమితిని మరోసారి గుర్తుచేసింది. అయితే ఈ తీర్పులు చట్టపరంగా సరైనవే అయినప్పటికీ, సామాజిక వాస్తవాలను పూర్తిగా ప్రతిబింబిస్తున్నాయా అనే ప్రశ్న మాత్రం మిగిలిపోతుంది. ఈ సమస్యకు మూలం 1950 ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల్లో ఉంది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ హోదా మొదట హిందువులకు మాత్రమే పరిమితం చేయబడింది.తర్వాత సిక్కులు,బౌద్ధులు చేర్చ బడ్డారు. కానీ క్రైస్తవులు,ముస్లింలు ఈ జాబితాలో చేరలేదు. ఇక్కడ ఒక కీలక ప్రశ్న తలెత్తుతుంది. కుల వ్యవస్థ మతంతో మారిపోతుందా?లేదా. అది ఒక సామాజిక వాస్తవమా? సమాధానం స్పష్టంగా కనిపిస్తుంది. కులం ఒక సామాజిక నిర్మాణం. మతం మారినా అది వెంటాడుతూనే ఉంటుంది. అయితే హక్కులు మాత్రం మారిపోతాయి. ఇదే అసలు విరుద్ధత. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఈ పరిస్థితిని చాలా ముందుగానే గుర్తించారు. ఆయన మాటల్లో, మతం మనిషి గౌరవాన్ని కాపాడాలి గానీ, అవమానాన్ని కాదు. అంబేద్కర్ స్వయంగా కులవ్యవస్థకు వ్యతిరేకంగా బౌద్ధమతాన్ని స్వీకరించడం ద్వారా ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు. సమానత్వం కోసం మార్పు అవసరం.

కానీ నేటి పరిస్థితుల్లో, అదే మార్పు కోసం ప్రయత్నించిన దళితులకు వ్యవస్థ పరిమితులు విధిస్తోంది. సుప్రీంకోర్టు తన పరిధిలో చట్టాన్ని అమలు చేస్తుంది. కానీ చట్టంలోనే లోపాలు ఉంటే, వాటిని సరిచేయాల్సిన బాధ్యత శాసనసభలపై ఉంటుంది.

దళిత క్రైస్తవులకు బీసీ హోదా ఇవ్వడం ఒక ప్రత్యామ్నాయం అని చెప్పబడుతున్నప్పటికీ, అది పూర్తి పరిష్కారం కాదు. ఎందుకంటే ఎస్సీ వర్గానికి లభించే రక్షణలు, అవకాశాలు బీసీ వర్గంలో ఉండవు. దీనివల్ల విద్య, ఉద్యోగాల్లో మరింత వెనుకబడే ప్రమాదం ఉంది.

ఈ నేపథ్యంలో, మత స్వేచ్ఛ అనే హక్కు కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకవ్యక్తి తన విశ్వాసం ప్రకారం మతాన్ని ఎంచుకోవచ్చు. కానీ ఆ నిర్ణయం వల్ల అతను సామాజిక రక్షణలను కోల్పోతే, అది నిజమైన స్వేచ్ఛగా పరిగణించాలా?

ఇది కేవలం న్యాయపరమైన సమస్య కాదు - ఇది సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కుల సమస్య. దళిత క్రైస్తవుల సమస్యను పరిష్కరించడానికి కేవలం కోర్టు తీర్పులు సరిపోవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, మేధావులు కలిసి ఒక సమగ్ర పరిష్కారం కనుగొనాలి. మొత్తానికి, ఇది ఒక సాధారణ చర్చ కాదు. ఇది భారత ప్రజాస్వామ్యానికి ఒక పరీక్ష. సమానత్వం అంటే మాటల్లో కాకుండా, అమల్లో కూడా కనిపించాలి. మత స్వేచ్ఛ అంటే కేవలం హక్కు మాత్రమే కాకుండా, గౌరవంతో జీవించే అవకాశాన్ని కూడా కల్పించాలి.

**- బి. రామారావు**
9030715343

# అంగన్వాడీల్లో ఒంటిపూట బడి



శంఖవరం మార్చి 25 మనం ప్రతినిధి: వేసవి తీవ్రత నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి ఒంటిపూట బడిని అమలు చేయడం జరిగిందని శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ పి. వెంకట్ లక్ష్మి తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కేంద్రాలు కొనసాగనున్నాయని, పని వేళలు మారినప్పటికీ లబ్ధిదారులకు అందే పోషకాహార పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టేక్ హోం రేషన్ విధానం పక్కాగా అమలు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తదుపరి నిర్ణయం వరకు కేంద్రాలకు ఒంటి పూట బడి విధానం కొనసాగనుందన్నారు.

# 'గంజాయి రహిత జిల్లా'గా మారుద్దాం

- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి (కలెక్టరేట్), మార్చి 25: డ్రగ్స్ మరియు గంజాయి రవాణాను పూర్తిగా అరికట్టి, అనకాపల్లి జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జరిగిన నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ (ౠఇఖ్ఘ) జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ లతో కలిసి జిల్లాలో అమలవుతున్న కఠిన చర్యలను సమీక్షించారు. జిల్లాలోని గంజాయి అక్రమ రవాణా మార్గాలు మరియు 72 అనుమానాస్పద 'హాట్ స్పాట్' ప్రదేశాల్లో 19 డ్రోన్ల సహాయంతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా ఉంచేందుకు 'ఈగల్ క్లబ్'లను చురుగ్గా నిర్వహించాలని సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా వివరణ:₹ 2025 -26 ఇప్పటివరకు 158 కేసులు నమోదు చేసి, 492 మందిని అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. జిల్లా సరిహద్దుల్లోని డౌనూరు, తాడిపర్తి, కోనాం, భీమవరం మరియు శ్రీరాంపురం వంటి ప్రాంతాల్లో శాశ్వత చెక్పోస్టులు, 38 డైనమిక్ తనిఖీలు నిరంతరం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

గంజాయి లేదా డ్రగ్స్ కు సంబంధించిన ఏ చిన్న సమాచారం ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1972 కి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వై.సత్యనారాయణ రావు, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్, ఆర్డీఓ షేక్ అయిషా, ఎస్.బి డీఎస్పీ శ్రీ జీ.ఆర్.ఆర్.మోహన్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి, ఎస్.బి ఇన్స్పెక్టర్ బాల సూర్యారావు, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, కె.కోటపాడు ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎన్డిపిఎస్ సెల్ ఇన్స్పెక్టర్ రమేష్, ఈగల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ నాయుడు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్ లో సెమీ సింథటిక్ డ్రగ్స్ నిర్మూలనపై సమావేశం

- కలెక్టర్ ఎం ఎన్ హరేంద్ర ప్రసాద్
- సిపి శంఖబ్రత బాగ్చి



**విశాఖపట్నం మార్చి 25 (మనం న్యూస్):** విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంద్ర ప్రసాద్, అడిషనల్ డి.జి.పి, కమీషనర్ ఆఫ్ పోలీస్ డా. శంఖబ్రత బాగ్చి, ఆధ్వర్యంలో కలెక్టర్ సమావేశమందిరంలో ఎన్ సి ఓ ఆర్ డి సమావేశం నిర్వహించారు.ఈ కో-ఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో గంజాయి మరియు ఇతర సింథటిక్ డ్రగ్స్, సెమీ సింథటిక్ డ్రగ్స్ రవాణా నిర్మూలించడం పై చర్చించారు.జిల్లా రెవెన్యూ, పోలీసు, ఎన్.సి.బి, విద్యా,వైద్య కస్టమ్స్ ,డ్రగ్ ఇన్స్పెక్టర్లు పోర్టు,కస్టమ్స్, ఈగల్ అధికారులు, రోడ్ ట్రాన్స్పోర్ట్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో జిల్లా నందు నార్కో మరియు ఇతర సింథటిక్ డ్రగ్స్ రవాణా పూర్తిగా నిర్వీర్యం చేయడం పై చర్చించారు, పాఠశాలలు మరియు కళాశాలల్లో ఈగల్ టీమ్లు మరియు ఈగల్ క్లబ్ల ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోన్నారు.సీపీ నగరంలోని ఉన్న వ్యసన విముక్తి కేంద్రాలు డ్రగ్-వ్యసన విముక్తి కేంద్రాల పనితీరు పై, వాటి బలోపేతం పై చర్చించారు, అదేవిధంగా నగర రైల్వే స్టేషన్ల వద్ద లగేజీ స్కానింగ్ మిషన్ల ఏర్పాటు, నగరంలోని నిర్మానుష్య ప్రాంతాల వద్ద పొదలు తొలగింపు, తగు లైటింగ్ ఏర్పాటు, అనుమానిత ప్రాంతాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు పై చర్చించి తగు కార్యాచరణ రూపొందించారు.

# ఏయూ స్నాతకోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్



విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి మార్చి 25: విశాఖపట్నం ఏ యూ కన్వెన్షన్ సెంటర్లో బుధవారం నిర్వహించిన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ 91, 92వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సభికులను ఉద్దేశించి ప్రసంగించారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్, ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ పూర్ణచంద్రరావు సగ్గుర్తి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత తల్లావజ్ఝుల పతంజలి శాస్త్రి హాజరయ్యారు.పాల్గొన్న వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్, ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీన్ ఆచార్య కె. శ్రీనివాస రావు, ప్రిన్సిపాళ్లు, ఆచార్యులు, పూర్వ వీసీలు ప్రముఖులు,జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పాల్గొన్నారు.



# కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

పిఠాపురం, మనంన్యూస్ః శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో సభ్యులు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు కోసం విద్యార్థులు చాలా సంవత్సరాలు ఎదురు చూశారు వారి శ్రమ వృధా కాకుండా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 2025 లో మెగా ఋఖిఇ పేరుతో 16 వేలు పైన ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేశారు అందులో మా గ్రంథాలయం నుండి 12 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయ కార్యవర్గం స్టడీ మెటీరియల్ మరియు ఫ్లాంక్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, పెమ్మరాజు సత్య రామచంద్రరావు, కాగిత నాగేశ్వరరావు, చింతపల్లి సింహాద్రి మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# కేజీహెచ్‌లో 2 డయాలసిస్ యూనిట్ ప్రారంభం

**విశాఖపట్నం మార్చి 25 (మనం న్యూస్):** విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ / కింగ్ జార్జ్ హాస్పిటల్, విశాఖపట్నం జనరల్ మెడిసిన్ విభాగం, ఆకస్మిక మరియు దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు నూతన డయాలిసిస్ యూనిట్ ప్రారంభించబడిన విషయాన్ని ఆనందంతో ప్రకటిస్తోంది. ఈ డయాలిసిస్ యూనిట్ ఆధునిక యంత్రాలు మరియు సదుపాయాలతో అమర్చబడి, సమర్థవంతమైన మరియు సురక్షితమైన హీమోడయాలిసిస్ చికిత్సలను అందించేందుకు రూపొందించబడింది. దీని ద్వారా ప్రస్తుతం ఉన్న సదుపాయాలపై భారం తగ్గి, రోగుల చికిత్స ఫలితాలు మెరుగుపడతాయి.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా.ఐ.వాణి, సూపరింటెండెంట్, కింగ్ జార్జ్ హాస్పిటల్, డా. జి. ప్రసాద్, నెఫ్రోలజీ విభాగాధిపతి, డా. డి. రాధాకృష్ణన్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు. నిరంతరం డయాలిసిస్ అవసరమయ్యే రోగులకు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, చికిత్స అందుబాటులోకి వచ్చినది.

# గ్యాస్ వాణిజ్య స్థావరాలపై దాడులు

**విశాఖపట్నం మార్చి 25 మనం న్యూస్:** విశాఖ జిల్లా లో బుధవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సర్కిల్ చెకింగ్ ఇన్స్పెక్టర్లు సంయుక్తంగా బర్మా క్యాంప్, కప్పరాడ, కంచరపాలెం ప్రాంతాలలో అలాగే సర్కిల్ -ఐఐ పరిధిలోని 11 ఎల్ పి గ్యాస్ వాణిజ్య స్థావరాలపై దాడులు నిర్వహించారు.

1955 (ఈసీ యాక్ట్ ) సెక్షన్ 6ఏ క్రింద 6 కేసులు నమోదు చేసి 21 గృహ వినియోగ ఎల్పీజీ సీలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్, చెకింగ్ ఇన్స్పెక్టర్లు మరియు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## పాదచారుల క్రాసింగ్ వద్ద విధిగా సూచిక బోర్డులు, బ్లింకర్స్ పెట్టాలి

## రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

## స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై, అవసరాలపై సంయుక్త పునఃపరిశీలన చేయాలి

**విశాఖపట్టణం, మార్చి 25 :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులంతా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ కలిసి బుధవారం సాయంత్రం కలెక్టర్ మీటింగు హాలులో ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో భాగంగా ముందుగా డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు గత రెండు సంవత్సరాలకు, ఈ ఏడాదికి సరిపోల్చుతూ నివేదికలను ప్రదర్శించారు. గతం కంటే ఇప్పుడు రోడ్డు ప్రమాదాలు తగ్గాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రథమంగా జిల్లాలో ఏర్పాటు చేసిన వేగ నియంత్రికల (స్పీడ్ బ్రేకర్స్)పై జీవీఎంసీ, ఆర్టీసీ, పోలీసు, రోడ్డు ట్రాన్స్ పోర్టు అధికారులు సంయుక్త పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. వాటి అవసరం ఎంత మేరకు ఉంది.. ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలను బేరీజు వేయాలని సూచించారు. అవసరం లేని చోట తొలగించాలని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వాళ్లపై కఠినంగా ఉండాలని, నిబంధనల అమల్లో రాజీ పడొద్దని పేర్కొన్నారు.

**స్పీడ్ లేజర్ గన్ లు సమకూర్చాలి..**
**లైసెన్సులు రద్దు చేయాలి : సీపీ**

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు, నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు యంత్రాంగం నుంచి సహకారం కావాలని, ముఖ్యంగా స్పీడ్ లేజర్ గన్ లు కావాలని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ కోరారు. రాత్రి పూట బైక్ రేసింగ్ లు చేసే వారిని కట్టడి చేసేందుకు అవి బాగా ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

సమావేశంలో డీసీపీ మణికంఠ చందోలు, డీటీసీ ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు, గాజువాక ఆర్టీవో సూర్యప్రకాశ్, ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనాయుడు, ఎంవీఐలు బుచ్చిరాజు, దుర్గాప్రసాద్, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలో అటవీ శాఖ భూమి!!?

## అయినా స్పందించని అధికారులు.!

## స్థలమే ఉన్నట్టు తెలియదంటున్న అటవీ శాఖ.!



**అనకాపల్లి /చీడికాడ మార్చి 25(మనం న్యూస్):** ఆక్రమణకు కాదేది కనర్హం అన్న చందంగా సుమారు అరకోటి విలువైన అటవీ శాఖ భూమిని దర్జాగా ఆక్రమిస్తున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం అంత చిక్కడం లేదు. చిత్రం ఏమిటంటే అటవీ శాఖకు అక్కడ భూమి ఉన్నట్లు తెలియదని కొంతమంది సిబ్బంది చెబుతున్నారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని కోనాం పంచాయతీ కేంద్రంలోనీ సర్వేనెంబర్ 151/7లో సుమారు 8 సెంట్లు స్థలం ప్రధాన రహదారి పక్కనే కలదు. ప్రస్తుత మార్కెట్ విలువను బట్టి సుమారు అరకోటి రూపాయలు విలువగల ఈ భూమిని కొంతమంది దర్జాగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు.

గత కొన్నేళ్లుగా ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకొని తమ ఇష్టానుసారం వాడుకుంటున్నారనీ పలువురు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణంలో తొలగించే స్థలాన్ని స్వాధీన పరచుకోవాలని ఈ ప్రాంతీయులు పలువురు కోరుతున్నారు.

# గ్యాస్ వాణిజ్య స్థావరాలపై దాడులు

**విశాఖపట్నం మార్చ్ 25 మనం న్యూస్:** విశాఖ జిల్లా లో బుధవారం విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సర్కిల్ చెకింగ్ ఇన్స్పెక్టర్లు సంయుక్తంగా బర్మా క్యాంప్, కప్పరాడ, కంచరపాలెం ప్రాంతాలలో అలాగే సర్కిల్ -ఐఐ పరిధిలోని 11 ఎల్ పి గ్యాస్ వాణిజ్య స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగముగా గృహ వినియోగ సిలిండర్ ల ను వాణిజ్య అవసరాలకు దుర్వినియోగం చేస్తున్న వాణిజ్య స్థావరాల ప్రతివాదుల పై అవసర సరుకుల చట్టం, 1955 (ఈసీ యాక్ట్ ) సెక్షన్ 6ఏ క్రింద 6 కేసులు నమోదు చేసి 21 గృహ వినియోగ ఎల్పీజీ సీలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్, చెకింగ్ ఇన్స్పెక్టర్లు మరియు విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో పారిశ్రామిక స్వర్ణయుగం ప్రారంభమైందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**పాతపట్నం: మార్చి 25: (మనం న్యూస్):** శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు. ఆయన మాట్లాడుతూ. ఉత్తరాంధ్రలో పారిశ్రామిక స్వర్ణయుగం ప్రారంభమైందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐ.టీ. పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ల సమష్టి కృషితో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోనున్నాయని పేర్కొన్నారు. రూ.1,35,964 కోట్లతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్ స్టీల్ ప్రాజెక్టు ఏపీలో ఏర్పాటు కావడం ఉత్తరాంధ్ర యువతకు వరం అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అభివర్ణించారు. ఇది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర యువత భవిష్యత్తును మార్చే గని అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 28 రాత్రి 8-30 నుండి 9-30 వరకు

# విద్యుత్ లైట్స్ ఆఫ్ చేయండి

- ఎర్త్ అవర్ కు మద్దతు ఇవ్వండి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం: మార్చి 25:** ఈ నెల 28వ తేది (శనివారం) రాత్రి 8-30 నుండి 9-30 గంటలు వరకు అవసరం లేని విద్యుత్ లైట్ లను ఆఫ్ చేసి ఎర్త్ అవర్ కు ప్రజలు, సంస్థలు మద్దతు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

ప్రకృతి పరిరక్షణ కోసం (గిగిఉ) వరల్ వైడ్ ఫండ్ ఇండియా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని, 2007 నుండి ప్రారంభమైన ఈ ఉద్యమం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అమలు జరుగుతున్నదన్నారు. 28వ తేది రాత్రి ఒక గంట పాటు అత్యవసరం కాని లైట్లను ఆఫ్ చేసే ప్రజలలో అవగాహన కల్పించేలా సందేశాలు ఇవ్వాలని, ఇందుకు గాను ప్రజలు, సంస్థలు, అధికారుల ముందుకు రావాలని వరల్ వైడ్ ఫండ్ ఇండియా కోరిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కలక్టర్ కోరారు.

# ఆ చిన్నారిని స్టేషన్‌కు రప్పిస్తారా?

## అత్యాచార కేసులో సుప్రీం ఆగ్రహం



**ఢిల్లీ, మార్చి 25:** నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార ఘటనలో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఏమాత్రం సున్నితత్వం లేకుండా బాలిక, ఆమె తల్లిదండ్రులతో వ్యవహరించారని గురుగ్రామ్ పోలీసులపై మండిపడింది. క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన తీరును తప్పుపడుతూ.. ఇది అత్యంత దారుణమైన ప్రవర్తన అని, వారిని అగౌరవించడమేనని మందలించింది. ఈ లైంగిక దాడి కేసులో పోలీసుల స్పందన సరిగా లేదని ఆరోపిస్తూ బాధితురాలి తల్లిదండ్రులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై బుధవారం మరోసారి విచారణ జరిగింది.

''దర్యాప్తులో భాగంగా ఆ చిన్నారి వద్దకు వెళ్లకుండా తననే పోలీసు స్టేషన్‌కు రప్పించడం సిగ్గుచేటు. మీరు బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేదు. మీరేమైనా రాజులా..?'' అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. అలాగే ఈ నేరాన్ని పోక్సో చట్టంలోని సెక్షన్ 6 నుంచి సెక్షన్ 10కి ఎందుకు మార్చారని అడిగింది. సెక్షన్ ఆరు ప్రకారం నేరం రుజువైతే 20 ఏళ్ల జైలుశిక్ష పడుతుంది. సెక్షన్ 10 కింద అయితే ఆ శిక్షాకాలం 10ఏళ్లే ఉంటుంది. బాలల సంక్షేమ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే సెక్షన్ 10లోకి చేర్చామని హరియాణా పోలీసుల తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ సమాధానం ఇచ్చారు. ''బాధితురాలి వాంగ్మూలం కంటే ఈ రిపోర్ట్‌కు ఎలా ప్రాధాన్యం ఇవ్వాలని అనిపించింది. ఆ బాలిక అమాయకత్వాన్ని మీరు నమ్మలేదు. సాక్ష్యం లేదని నిరూపించే ప్రయత్నాలు జరిగాయి. ఒక చిన్నారిపై లైంగిక దాడి ఘటనలో మీ అవగాహన ఇదే అయితే చట్టబద్ధ పాలన సంగతేంటి..? ఈ ఘటనపై పోలీసులకు స్పష్టమైన అవగాహన లేదు. అదే ఆందోళన కలిగిస్తోంది. చట్టం పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులను బదిలీ చేయాలి. ఈ కేసులో సీసీటీవీ లేదు.. అదీఇదీ అని చెప్తున్నారు. గత 15 రోజులుగా మీరు ఏం చేస్తున్నారు. మేం ఈ కేసును పరిగణనలోకి తీసుకోగానే మీరు అరెస్టులు మొదలు పెట్టారు. అసలు బాలల సంక్షేమ కమిటీ సభ్యులు ఎవరు? వారి అర్హతలు ఏంటి? వారిని ఎవరు నియమిస్తారు?'' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. అలాగే అఫిడవిట్‌లో చిన్నారి పేరు ప్రస్తావించడాన్ని తప్పుపట్టింది. ఈ కేసు దర్యాప్తు కోసం ముగ్గురు సభ్యులతో సిట్ ఏర్పాటుకు ఆదేశాలు ఇచ్చింది. గురువారంలోగా కేసు రికార్డులను సిట్‌కు అప్పగించాలని ఆదేశించింది. విచారణలో నిర్లక్ష్యంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పోలీసులకు, బాలల సంక్షేమ కమిటీకి నోటీసులు జారీ చేసింది. అంతేగాకుండా పోక్సో కోర్టుకు కేసును అప్పగించాలని గురుగ్రామ్ జిల్లా న్యాయమూర్తిని ఆదేశించింది.

# స్వర్ణాంధ్రలో ప్రారంభమైన జాతీయస్థాయి హ్యాకథాన్

నరసాపురం, మార్చి 25 (మనం న్యూస్)ః నరసాపురం మండలం సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్, సైబర్ సెక్యూరిటీ అండ్ బిజినెస్ సిస్టమ్స్ డిపార్ట్మెంట్ మరియు ఆక్వాటెక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజన్ - ఎక్స్ 2026 జాతీయ స్థాయి హ్యాకథాన్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ జాతీయస్థాయి హ్యాకథాన్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి 64 టీములు, ఇతర రాష్ట్రాల నుంచి 12 టీములు, స్వర్ణాంధ్ర కళాశాల నుంచి 37 టీములు పాల్గొంటున్నారు. ఈ జాతీయస్థాయి




హ్యాకథాన్ కార్యక్రమాన్ని స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కొండవీటి వెంకట సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, డైరెక్టర్ ఎస్. కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపీచంద్ ఘనంగా ప్రారంభించారు. సిఎస్సీ విభాగాధిపతి డాక్టర్ పి శ్రీనివాసులు, డాక్టర్ బి మధు కుమార్, సిఎస్ అండ్ బిఎస్ విభాగాధిపతి డాక్టర్ టి. మురళీమోహన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన టీములు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

# మావుళ్ళమ్మ హుండీ ఆదాయం 26. 63 లక్షలు

భీమవరం, మార్చి 25 (మనం న్యూస్)ః భీమవరం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పు, ఆరాధ్యదైవం శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ బుద్ధ మహా లక్ష్మి నగేష్ ఆధ్వర్యంలో హుండీలు తెరచి లెక్కించారు. 26 రోజులకు హుండీల ద్వారా రూ. 25,63,619 రూపాయలు లభించగా 30.200 గ్రాముల బంగారం, 55 గ్రాముల వెండి వస్తువులు మావుళ్ళమ్మకు భక్తులు సమర్పించుకున్నారు. కాకినాడ ఎమ్మెస్ఎన్ చారిటీ అసిస్టెంట్ కమిషనర్ చాగంటి సురేష్ నాయుడు పర్య వేక్షణలో నిర్వహించిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, ఆలయ చైర్మన్ బొండాడ నాగభూషణం, ధర్మకర్తలు రామాయణం శ్రీనివాస్,



ఉదీశి మీనాక్షి, జి. రమణ, మిర్తిపాటి గుణేశ్వరరావు, అతికెల ఆంజనేయప్రసాద్, మల్లువలస లక్ష్మీ నిర్మల, మత్యపురి గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి రఘునాథ్, కలిగొట్ల గ్రూపు ఆలయాల కార్యనిర్వహణాధికారి మంతెన రామరాజు, కరూర్ వైశ్య బ్యాంకు సిబ్బంది, పోలీసు అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణదికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

# ఆరోగ్యపరమైన సమాచారాన్ని ప్పటికప్పుడు అమలు చేయాలి




ముమ్మిడివరం, మార్చి 25, మనం న్యూస్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని మండల కేంద్రమైన తాళ్ళరేవులో బీమాబాయి మహిళా మండలి ప్రధాన కార్యాలయంలో ఆరోగ్యశాఖ, ఏఆర్టీ కేంద్రాలు,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ,ఫెడరేషన్లు,గ్రామ సమాఖ్యలు ప్రతినిధులు మరియు ఆశ కార్యకర్తలతో సంప్రదింపుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో వచ్చే ఆరోగ్యపరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అమలు చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా అనేక శారీరక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ప్రతినిధులు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మీద అసత్య ఆరోపణలు ఖండించిన జనసేన నాయకులు

కుక్కునూరు,మార్చి 25( మనం న్యూస్ )ః కుక్కునూరు మండలంలో కొన్ని పంచాయితీలలో ఏర్పాటుచేసిన జామాయిల్, జామ నర్సరీల విషయంలో ఓ ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్లో పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అండతో అటవీ, రెవెన్యూ భూములను కబ్జా చేసి నర్సరీ వ్యాపారాన్ని యదేచ్చగా నిర్వహిస్తున్నారని వచ్చిన కథనాలను కుక్కునూరు జనసేన మండల పార్టీ తీవ్రంగా ఖండించింది . గత 20 ఏళ్లుగా నిర్వహిస్తున్న వ్యాపారాన్ని ప్రస్తుత ఎమ్మెల్యేకి ఆపాదించడం సమంజసం కాదని దీనిపై అసత్య కథనాలు ప్రచారం చేసిన మీడియా ప్రతినిధి పై, సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కుక్కునూరు మండల జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాలకృష్ణ, మోదుంపురపు



వెంకన్నబాబు ఆధ్వర్యంలో కుక్కునూరు పోలీస్ స్టేషన్ లో బుధవారం నాడు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం లో జనసేన ఉపాధ్యక్షులు మంత్రి గోపాల కృష్ణ, మోదుంపురపు వెంకన్న బాబు, సీనియర్ నాయకులు చల్ల కోటేశ్వరరావు, టౌన్ ప్రెసిడెంట్ కె సీతారామయ్య, వార్డ్ మెంబెర్ గాడిద వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీను, గంధం నాగరాజు,లక్ష్మణ స్వామి,రామ కృష్ణ,జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

# తెదేపాతోనే తెలుగుజాతి ఆత్మగౌరవం

భీమవరం, మార్చి 25 (మనం న్యూస్)ః తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వారోత్సవాలను భీమవరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్, పార్టీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. వీటిలో భాగంగా బుధవారం పట్టణం లోని 2,11,12, 22, 25వ వార్డులలో నూతనంగా నిర్మించి న తెదేపా జెండా స్థూపాలను ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి 43 వసంతాలు పూర్తిచేసుకుని 44వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని ప్రతి గ్రామాలు, వార్డులలో ఆవిర్భావ దినోత్సవ జెండా పండుగ వేడుక ఘనంగా నిర్వహిస్తున్నామని



తెలిపారు. పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించిన 9 నెలలలోనే అధికారంలోకి తీసుకువచ్చి అనేక సంస్కరణలతో ప్రజల లో రాజకీయ చైతన్యం తెచ్చారని ప్రతి గ్రామంలోనూ వార్డులలోనూ టీడీపీ జెండా పండుగ నిర్వహించడం సంతోషకరమన్నారు. ఎఎంసి చైర్ పర్సన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వెంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు ప్రజల కోసం రూపొందించిన తెలుగుదేశంపార్టీ దేశ రాజకీయాలలో ప్రముఖ పాత్ర వహిస్తుందని ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేస్తేనే అంతిమ ఫలితాలు పొందగలమని అన్నారు. పొందగలమన్నారు. కార్యక్రమంలో నాయకులు గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, చల్లబోయిన గోవింద్ మేరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా సాగిన సామాజిక తనిఖీ

- రికవరీ అంతంత మాత్రమే
- సిబ్బందిపై చర్యలు లీలా

కోటనందూరు మనం న్యూస్ మార్చ్ 25::, కోటనందూరు మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పనులకు 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. దీనిపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక ను ఎంపీడీవో పి వెంకటనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాద్వామా పిడి అడపా వెంకటలక్ష్మి, ఏపీ డి భాను ప్రకాష్ హాజరయ్యారు.17 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సామాజిక తనిఖీని డి ఆర్ పి లు వేదికలో వెల్లడించారు. ఏ గ్రామ పంచాయతీలో చూసిన మస్తరు సీట్లలో వేతన దారుల సంతకాలు, వేలి ముద్ర లు లేకుండానే చెల్లింపులు జరిగినట్లు గుర్తించామని డిఆర్పీలు పేర్కొన్నారు. చాలా చోట్ల మొక్కలు కూడా లేవని వారు తెలిపారు. అంతేకాకుండా పనులు చేసిన ప్రాంతాల్లో వర్క్ చేసిన వివరాలు తెలిపే ప్రకటన బోర్డులు లేవన్నారు. ఎస్టిమేట్ లేకుండానే పేరు మార్పు చేసి రోడ్డువేశారని డిఆర్పి పేర్కొన్నారు. దీనిపై గ్రామ




సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ను పిడి మందలించారు. చివరకు సామాజిక తనిఖీని సిబ్బందిపై ఎటువంటి చర్యలు లేకుండానే మమ అనిపించి ముగించారు. ముందుగా మండలంలో ఈజీఎస్ 688 పనులు, పి ఆర్ 81 పనులు, ఆర్డబ్ల్యూఎస్ 1, పి ఆర్ ఏడు పనులకు వేతన చెల్లింపులు, మెటీరియల్ చెల్లింపులతో కలిపి రూ 13 కోట్ల29 లక్షల83 వేల 165లు చెల్లింపు జరిగిందని ఎస్ఆర్పిపి.రాజు తెలియజేశారు. దీనిపై నెల రోజులపాటు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ లగుడు శ్రీనివాస్, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు పోతల సూరిబాబు, పి ఆర్ డి ఇ ఎం. శివాజీ రావు, సోషల్ ఆడిట్ అధికారి రాజేష్, ఏపీవో రాజగోపాల్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పారేపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించిన ముద్రగడ



ఏలేశ్వరం,మార్చి 25 (మనం న్యూస్)ః ఏలేశ్వరం నగర పంచాయతీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు బుధవారం పర్యటించారు.పట్టణంలోని 7వ వార్డుకు చెందిన పారేపల్లి వీరభద్రరావు ఇటీవల మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు వీరభద్రరావు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.ఇలాంటి సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సామంతుల సూర్యకుమార్,వాగు బలరాం,పైల విజయ్,ముద్రగడ వీరేంద్ర,కోరాడ ప్రసాద్,సుంకర రాంబాబు,గోళ్ళ నాగేశ్వరరావు స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సైకిళ్ళు, మందులు అందించిన వాకర్స్ క్లబ్,




పాలకొల్లు,మార్చి 25,మనం ప్రతినిధిః బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామరాజుల్లంక, నాగుల్లంక గ్రామాలకు చెందిన తండ్రి ఆసరా లేని పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు మెరిట్ విద్యార్థులు ఉరింక మధు వర్షిణి, మండపాక సిద్దు లకు బడికి వెళ్ళడానికి గాను వాకర్స్ క్లబ్ పాలకొల్లు తరపున 14 వేల రూపాయల విలువైన రెండు సైకిళ్ళు మరియు బట్టెలంక కు చెందిన దీర్ఘకాలిక చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థిని బి. హాసిని కి 7 వేల రూపాయల మందులను బుధవారం ఉదయం కొత్త కుళాయి చెరువు వద్ద క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ సభ్యులతో కలిసి అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, సామాజిక కార్యకర్త బోనం రాజు,కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, సలాది రామచంద్రరావు,ధనాని శ్రీరామమూర్తి,జవ్వాజి కల్యాణ్, కటారి నాగేంద్ర కుమార్, చామా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెం పంచాయతీకి ఐఎస్ఓ సర్టిఫికెట్



- రాష్ట్రంలోనే తొలి గుర్తింపు..
- కేరళ బృందం చేతుల మీదుగా అందజేత.


రావులపాలెం, మార్చి 25: (మనం ప్రతినిధి)ః కేరళ తరహాలో ప్రపంచ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహణ, పరిపాలనలో ప్రత్యేక గుర్తింపుగా భావించే ఐఎస్ఓ సర్టిఫికెట్ను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామపంచాయతీ దక్కించుకుంది. ఆంధ్రప్రదేశ్లో ఈ గుర్తింపును పొందిన తొలి గ్రామపంచాయతీగా రావులపాలెం నిలవడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా 24 గ్రామపంచాయతీలు ఐఎస్ఓ సర్టిఫికెట్ కోసం ఎంపికైన జాబితాలో ఉండగా, వాటిలో మొట్టమొదటి సర్టిఫికెట్ రావులపాలెంకే దక్కింది. గత కొద్ది నెలలుగా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చేపట్టిన కృషికి ఇది ఫలితంగా నిలిచింది.

గత మూడు రోజులుగా రావులపాలెంలో పర్యటించిన కేరళకు చెందిన ఐఎస్ఓ ఆడిట్ బృందం గ్రామపంచాయతీ పరిపాలనను క్షుణ్ణంగా పరిశీలించింది. బృందంలో ప్రేమానంద్ సి.ఎం., సలీం కె.ఎం., రాష్ట్ర పంచాయతీరాజ్ కోఆర్డినేటర్ ఇమామ్ ఉన్నారు. వీరు పంచాయతీకి సంబంధించిన 98 రికార్డులు, పౌరసేవల అమలు, పరిపాలనా తీరు, అభివృద్ధి కార్యక్రమాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగాపరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాస్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిలువూరి సతీష్ రాజు, సాకా ప్రసన్న కుమార్, కోట సోమేశ్వరరావు, కె.వి. సత్యనారాయణ రెడ్డి (చిన్న కెవి), డీడీవో ఎస్టీవీ రాజేశ్వరరావు, ఎంపీడీవో చాగంటి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఎంపీడీవో వి.వి. నాగ వీరేష్, అమర్నాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# పోడూరు బస్టాండ్ కూడలిలో ప్రమాదాల బెడద

- ప్రాణాలకే ముప్పుగా మారిన కూడలి

పోడూరు మార్చి 25 మనం న్యూస్ : పోడూరు గ్రామంలో రోజూ జరిగే చిన్న చిన్న ప్రమాదాలు ఇప్పుడు పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయేమోనని ప్రజలు భయంతో గడుపుతున్నారు. బస్టాండ్ సమీపంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రతి రోజు వాహనాలు వేగంగా దూసుకువస్తుండటంతో, ఒక్క క్షణం అప్రమత్తం లేకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని భయంతో గ్రామ ప్రజలు, ప్రయాణికులు వణుకుతున్నారు. బస్టాండ్ వద్ద నాలుగు రోడ్ల కూడలి - స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాల పరంపర పోడూరు గ్రామ బస్టాండ్ సమీపంలో గరగలమ్మ గుడి నుంచి వచ్చే మార్గం, చింతల తోట నుంచి



వచ్చే రహదారి, పంచాయతీ కార్యాలయం నుంచి వచ్చే మార్గం, రాజుల ఏరియా నుంచి వచ్చే దారి నాలుగు రోడ్లు ఒకే చోట కలవడం వల్ల తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. ద్విచక్ర వాహనదారులు, ముఖ్యంగా యువత అధిక వేగంతో రావడం, ఒకరికి ఒకరు కనిపించని పరిస్థితి వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన గ్రామ ప్రజలు వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ అధికారులు,సర్పంచ్ సువర్ణ రాజు సారవతో పంచాయతీ వైపు వెళ్లే రోడ్డుకు, గరగలమ్మ గుడి మార్గానికి, చింతల తోట దారికి ఒక్కో వైపున స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని ప్రజలు ఆశిస్తున్నారు.

# ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధుల కృతజ్ఞతలు




ముమ్మిడివరం, మార్చి 25, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన తాళ్లరేవులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం శెట్టిబలిజ జాతి పితామహుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి 173వ జయంతిని కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిన సందర్భంగా ప్రజా ప్రతినిధులు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు , కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ , డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి పాల్గొని,ప్రత్యేక జీవో ద్వారా దొమ్మేటి వెంకటరెడ్డి 173 వ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# 27 రోజుల్లో వాడపల్లి శ్రీవారికి రూ.1.82 కోట్లు

- హుండీ లెక్కింపులో భారీ ఆదాయం..
- బంగారం, వెండి, విదేశీ కరెన్సీ నోట్లు లభ్యం.



రావులపాలెం, మార్చి 25 (మనం ప్రతినిధి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల కానుకల ప్రవాహం కొనసాగుతోంది. బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపు కార్యక్రమంలో మొత్తం రూ.1,82,94,288 ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు. కేవలం 27 రోజుల వ్యవధిలోనే ఇంత భారీ స్థాయిలో ఆదాయం నమోదుకావడం ఆలయంపై భక్తులకున్న విశ్వాసాన్ని చాటుతోంది. ఆలయ ప్రధాన హుండీతో పాటు శ్రీ విశ్వేశ్వర స్వామి వారి హుండీల ద్వారా రూ.1,47,36,474 నగదు లభించగా, అన్నప్రసాదం హుండీల ద్వారా రూ.35,57,814 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ రెండింటిని కలిపి మొత్తం రూ.1.82 కోట్లకు పైగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. భక్తులు నగదుతో పాటు బంగారం, వెండి, విదేశీ కరెన్సీ రూపంలో కూడా కానుకలు సమర్పించారు. హుండీలలో 19 గ్రాముల బంగారం, 860 గ్రాముల వెండి, అలాగే 12 దేశాలకు చెందిన 51 విదేశీ కరెన్సీ నోట్లు లభించాయి. విదేశాల్లో నివసిస్తున్న భక్తులు కూడా శ్రీవారిపై తమ భక్తిని ఈ విధంగా చాటుతున్నారని దేవస్థాన వర్గాలు పేర్కొన్నాయి. హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ ఆవరణలో భద్రతా నిబంధనల మధ్య పారదర్శకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు టి. సాయి ప్రసాద్, పి. భవాని, సి.హెచ్. సత్యనారాయణ, ఎస్. సూర్య కుటుంబరావు పాల్గొన్నారు. పర్యవేక్షణ బాధ్యతలను అసిస్టెంట్ కమిషనర్ జిల్లా దేవదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ, తనిఖీదారు ఎస్.టి.పి.టి. శ్రీనివాస్, ఈఓ గ్రూప్-2 పి.వి.వి.ఎస్. కామేశ్వరరావు, ఈఓ గ్రూప్-3 బి. కిరణ్ నిర్వర్తించారు.

# పటిష్ట భద్రత నడుమ ఈవీఎం, వీవీప్యాట్ గోదాంలు



- జేసి టి నిశాంతి.

ముమ్మిడివరం మార్చి 25 మనం న్యూస్ : ఈవీఎం, వీవీప్యాట్ల గోదాముకు పకడ్బందీ భద్రత కల్పించడం జరిగినప్పటికి నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధి కారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి అదేశించారు. బుధవారం స్థానిక ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తు నందు భద్రపరిచిన ఈవీఎం వివి ప్యాట్ గోదాములను ఆమె భారత ఎన్నికల సంఘం నిబంధన లకు అనుగుణంగా రెవెన్యూ పోలీస్ అగ్నిమాపక భద్రతా సిబ్బంది రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ నిర్వహించారు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలు, మార్గదర్శకాల కు అనుగుణంగా సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీ లించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రప రుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవి ధం గా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నూ మూడు నెలలకు ఒక సారి (త్రైమాసిక) తనిఖీలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వ హిస్తున్న పోలీస్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని జిల్లా జాయిం ట్ కలెక్టర్ అధికారులకు సూచిం చారు.

# మలబార్ ట్రస్టు ద్వారా 2,800 మందికి స్కాలర్ షిప్ లు అందజేత

- పి4 లో గిరిజన విద్యార్థులను దత్తత తీసుకోవాలని కోరిన
- మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి







విజయవాడ,మార్చి,25,(మనం న్యూస్) మలబార్ ట్రస్ట్ సేవలు అభినందనీయంమని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు.కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ ఆర్ యాక్టివిటీస్) లో భాగంగా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో 2,800 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యా రాణి మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ ఆర్ యాక్టివిటీస్) లో భాగంగా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 2,800 మంది విద్యార్థులకు ఒకొక్కరికి 10 వేల రూపాయల చొప్పున 3 కోట్ల రూపాయల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ...... మలబార్ సంస్థ కేవలం వ్యాపారమే కాకుండా, 1999 నుండి విద్య, వైద్యం, తాగునీరు పేదల ఆకలి తీర్చడం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఏడాది 2,800 మంది విద్యార్థులకు సుమారు ₹3 కోట్ల విలువైన స్కాలర్షిప్లను అందజేయడం గొప్ప విషయంగా మంత్రి పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ₹4 (₹ఖ్రజీఛి ₹టజీర్ఱీ ₹ౌఇజ్ఞా ₹ట్టుటఱజీఇ) విధానం ద్వారా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని, మలబార్ వంటి సంస్థలు ఇందులో భాగస్వాములు కావడం సంతోషదాయకమన్నారు.

### గిరిజన ప్రాంతాలపై దృష్టి పెట్టండి....

గిరిజన ప్రాంతాల్లో 'సికిల్ సెల్ అనీమియా' వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, ఆ ప్రాంతాలను దత్తత తీసుకుని అక్కడి పిల్లల విద్య, వైద్యానికి సహకరించాలని మలబార్ సంస్థను మంత్రి కోరారు.

### వృద్ధాశ్రమలు లేని ఏపీగా తీర్చిదిద్దుదాం...

సమాజంలో వృద్ధాశ్రమాలు పెరగడంపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు తమ తల్లిదండ్రులను కళ్లల్లో పెట్టుకుని చూసుకోవాలని, వృద్ధాశ్రమాలు లేని ఆంధ్రప్రదేశ్ను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అమ్మలాగా బాధ్యతలను స్వీకరిస్తూ సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆకాంక్షించారు. శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ... మల్బార్ సంస్థ గత సంవత్సరం కూడా వేలాది మందికి స్కాలర్షిప్స్ అందజేసిందని, ఈ ఏడాది కూడా సుమార్చు₹200 కోట్లు పేద ప్రజల సంక్షేమం కోసం (చదువు, భోజనం, ఆరోగ్యం) కేటాయించడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం చెప్పే ₹4 కార్యక్రమం గురించి మల్బార్ సంస్థ ప్రతినిధులకు వివరించి భాగస్వాములు కావాలని కోరారు. కేవలం ₹10,000 స్కాలర్షిప్ ఇవ్వడమే కాకుండా, కొన్ని కుటుంబాలను దత్తత తీసుకుని, ఆ ఇంట్లోని పిల్లల పూర్తి చదువు బాధ్యత మరియు తల్లిదండ్రులకు ఉపాధి కల్పించాలని సూచించారు. ఇలాంటి కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చి కుటుంబాలను ఆదుకుంటే రాష్ట్రంలో, దేశంలో పేదరికాన్ని త్వరగా నిర్మూలించవచ్చని శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### మలబార్ గ్రూప్ హెడ్ రిటైల్ ఆపరేషన్స్ (రెస్ట్ ఆఫ్ ఇండియా) పి కె సిరాజ్ మాట్లాడుతూ.

మలబార్ గ్రూప్ 1999 నుండి తన లాభాల్లో 5% సామాజిక సేవా కార్యక్రమాల కోసం కేటాయిస్తోందని ప్రభుత్వ నిబంధన 2% కంటే ఇది ఎక్కువగా ఉందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సి ఎస్ ఆర్ కార్యకలాపాల కోసం ₹200 కోట్లు కేటాయించినట్లు సంస్థ ప్రకటించిందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1.45 లక్షల మంది విద్యార్థినులకు ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందించామన్నారు. కేవలం ఆంధ్రప్రదేశ్లోనే 15,526 మంది విద్యార్థులక్కు₹8 కోట్లు ఖర్చు చేశామన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 33,000 మంది విద్యార్థినులకు₹30 కోట్ల విలువైన స్కాలర్షిప్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్లో 2,800 మంది విద్యార్థులక్కు₹2.52 కోట్ల స్కాలర్షిప్లను అందజేస్తున్నట్లు సిరాజ్ తెలిపారు. కార్యక్రమంలో సిదార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.పద్మజ, బయానా మురళీ కృష్ణ, బొండా సుజాత, ఆంధ్రప్రదేశ్ జోనల్ హెడ్ నిఖిల్ చంద్రన్, వివిధ స్కూల్స్ కి చెందిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు...

# జిల్లా అభివృద్ధి, సమస్యలపై మంత్రుల సమావేశం



- పాల్గొన్నఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం, మార్చి 25 (మనం న్యూస్) : పశ్చిమగోదావరి జిల్లాలో నెలకొని ఉన్న సమస్యలు, నరసాపురం నియోజకవర్గంలో పెండింగులో ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో నిర్వహించిన సమావేశానికి ముందు జిల్లాలోని సమస్యలు, అభివృద్ధి పనులపై పశ్చిమగోదావరి జిల్లా ఇన్చార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చర్చించారు. ఈ సమావేశం లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, శాసన సభ ఉప సభాపతి కె. రఘురామకృష్ణ రాజు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ , ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.


# మీ ఇంటికి - మీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం



కాట్రేనికోన మార్చి 25 మనం ప్రతినిధిః 'మీ ఇంటికి - మీ డాక్టర్ ' కార్యక్రమం బుధవారం కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామం ప్రారంభించారు. నూతనం గా ఏర్పాటు చేసిన అంబులెన్సు ను జడ్పీటీసీ నేల కిషోర్ కుమార్, తహసీల్దార్ రవి కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం లో కోలాటి సత్యం, నల్లా నరసింహ మూర్తి, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# చూసిన కనులదే భాగ్యం

- తూలగిరి శ్రీ సీతారాముల ప్రాణ ప్రతిష్ట వేడుక



ప్రత్తిపాడు,మార్చి,25:-(మనం న్యూస్)ః కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రగిరి కొండపై నూతనంగా నిర్మించిన తూలగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సీతానగరం ఆశ్రమాధిపతి త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహా ప్రతిష్ట మహోత్సవం చేపట్టారు.అలాగే ఉప ఆలయాలు,ధ్వజ స్థంభ ప్రతిష్ట,ఆలయ శిఖర కలశ ప్రతిష్ట భక్త జనం మధ్య కన్నుల పండుగగా జరిగాయి.సీతారామచంద్ర స్వామి దర్శనార్థం భక్తులు ఆలయానికి పోటెత్తారు.శ్రీరామ సంకీర్తనతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఆలయ ప్రాంగణంలో త్రిదండి రామానుజ చిన్న జీయర్ స్వామి చెప్పిన ప్రవచనాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

# జగపతినగరం వ్యాపారికి ప్రమాదం



కిర్లంపూడి మార్చి 25:( మనం న్యూస్ )ః కిర్లంపూడి-ప్రత్తిపాడు రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జగపతినగరానికి చెందిన కూరగాయల వ్యాపారి పిడుగు రమణకు తీవ్ర గాయాలయ్యాయి. పరీక్షలకు వెళ్తున్న ఓ విద్యార్థి నిర్లక్ష్యంగా బైక్ నడిపి వరుసగా రెండు బైకులను ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమణను స్థానికులు వెంటనే ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రి (జీజీహెచ్)కు రిఫర్ చేశారు.

# మాజీ మంత్రి తోట నరసింహం వాస్తవాలు గ్రహించి మాట్లాడాలి



- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట మార్చి 25: మనం న్యూస్ః జగ్గంపేట స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మీడియాతో మాట్లాడుతూ నిన్న మాజీ మంత్రి తోట నరసింహం జగ్గంపేట డ్రైవర్స్ కాలనీ విషయమై కలెక్టరేట్లో మీడియాతో మాట్లాడిన ఆయన అవగాహన రాయిత్యంతో మాట్లాడారని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆయన వాస్తవాలను మరిచి మాట్లాడడం జరిగిందని డ్రైవర్స్ కాలనీ లో పేదల పట్టాలను రద్దు చేయొద్దని అనడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. 2010లో తోట నరసింహం మంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో 170 మంది లబ్ధిదారులు డ్రైవర్లకు, ఆశా వర్కర్లకు, సెక్స్ వర్కర్లకు, విలేకరులకు, సామాన్య ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని కానీ అక్కడ మౌలిక వసతులు లేక ఇల్లు కట్టుకోలేకపోయారని ఆయన మాట్లాడడం జరిగిందని మరి ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చిన్న కాలనీ అయినటువంటి డ్రైవర్స్ కాలనీకే మౌలిక వసతులు కల్పించ లేక పోయారంటే వారి యొక్క పరిపాలన ఏ విధంగా సాగిందో ఒక్కసారి గ్రహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, పిల్లా చంటిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, ఘాజింగం సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, పోసిన ప్రసాద్, గల్లా రాము తదితరులు పాల్గొన్నారు .

# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు, వదంతులు నమ్మ వద్దు



అమలాపురం మార్చి 25 మనం న్యూస్ః రాష్ట్రవ్యాప్తంగా గాని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా గాని ఎక్కడా కూడా పెట్రోలు డీజిల్ కి ఏ విధమైన కొరత లేదని గతంలో మన జిల్లా వినియోగం ఎంతయితే ఉందో అంత పెట్రోలు డీజీలు స్టాకులు మన బంకులకి వస్తున్నాయని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ తెలియజేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆధారపడి ఎవరూ కూడా కంగారు పడవద్దని, కంగారుపడి ఎక్కువ ఆయిల్ తీసుకొని కృత్రిమ కొరత సృష్టించవద్దని కోరారు.

# ఒమ్మంగి గ్రామంలో మురళిరాజు పర్యటన



ప్రత్తిపాడు,మార్చి25(మనంన్యూస్ )ః మండలంలో ఒమ్మంగి గ్రామంలో ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు పెట్రోల్ బంక్ ఎదురుగా బాబు కాలనీ నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాములు రామాలయం పునర్నిర్మాణ,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని సీతారాముల వారిని దర్శించుకుని ఆలయ కమిటీ వారికి 1లక్ష రూపాయలు విరాళాన్నిప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, రామిశెట్టి దొరబాబు,ముమ్మిడి వీరబాబు, తోలేటి శేఖర్,గంట లచ్చబాబు(బుజ్జి),సుంకర తమ్మారావు, గంట చిట్టిబాబు,దేశెట్టి దుర్గాప్రసాద్, ఓరుగంటి వెంకన్నబాబు, గొర్ల తాతబాబు,నార్లంక వెంకన్నబాబు, వైస్సార్సీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు



ముమ్మిడివరం,మార్చి 25, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు బుధవారం ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద కుటుంబ శుభకార్యంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈశుభకార్యంలో నడింపల్లి సూర్యనారాయణ రాజు(వినోద్)మరియు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోరింటాడలో రూ. 5.35 కోట్లతో మంచినీటి పథకం పనులకు శంకుస్థాపన




పాలకొల్లు, మార్చి 25,మనం ప్రతినిధి పాలకొల్లు మండలం గోరింటాడ గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద జలజీవన్ మిషను నిధులు రూ. 5.35 కోట్లతో మంచినీటి పథకం పనులకు గ్రామ సర్పంచ్ మండెల పావని దంపతులు శంకుస్థాపన చేశారు. జరిగింది ఈ కార్యక్రమంలో ఏ ఎం సి చైర్మన్ కోడి విజయభాస్కర్ ఏ ఓ రాజశేఖర్,డి ఇ సురేష్ కుమార్ నాయకులు పాముల రజిని కుమార్, కలిదిండి రామచంద్ర రాజు, మండేల త్రిమూర్తులు, చిరుమామిళ్ల రోహిణి రావు, పట్టాపు విజయభాస్కర్, కారుపల్లి వెంకటేశ్వరరావు, పార్సి రాజబాబు, ఫణీంద్ర, కండిబోయిన వెంకట సుబ్రహ్మణ్యం, మండే ల పురుషోత్తం, జోగి సత్యనారాయణ, మండేల తాతాజీ అద్దె కోటి వీరభద్రం, పెనుమత్స శ్రీనివాసరాజు, రాయి ప్రసాద్, తదితర పాల్గొన్నారు

# ఆలయ ప్రారంభ మహోత్సవంలో తుమ్మలపల్లి



కిర్లంపూడి మార్చి 25:( మనం న్యూస్ )ః కిర్లంపూడి పరిధిలోని గెద్దనాపల్లి గ్రామంలో శ్రీ గోపాలకృష్ణుని ఆలయ ప్రారంభ మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్థులతో కలిసి మహా అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆకుల నవీన్, నిమ్మల శ్రీను, ఆకుల సురేంద్ర, అరినే రాజేష్, బర్నికల తాతాజీ, అలమల్ల నాగు, కోన దొర, ఒమ్మి లక్ష్మజీ, ఒమ్మి అబ్బు, సప్పా తాతాజీ, సామిరెడ్డి పద్మనాభం, గ్రామ పెద్దలు, భక్తులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చిత్రకారుడు'అంజి'కి సత్కారం



కాట్రేనికోన మార్చి 25 మనం ప్రతినిధి ః ఉగాది రోజున కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు, అంజి అకోండి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదగా ఉగాది పురస్కారం అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే, బుధవారం కాట్రేనికోన పంచాయతీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ ఆధ్వర్యంలో అంజికి ఘనంగా సత్కారం చేశారు, పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంను లో అంజి, ఆయన తండ్రి కష్ణ ను పూల మాలలు, శాలువా లతోసన్మానం చేశారు ఈ కార్యక్రమం లో గంటి వెంకట సుధాకర్, ఎస్ నాగేశ్వరావు, టి వెంకట రత్నం, ఎస్ సూర్యనారాయణ ,వాసంశెట్టి రాజేశ్వరరావు, ఎన్ నరసింహ మూర్తి, వెంట్రు సుధీర్, వి శ్రీనివాస్, పి జగన్, ఎన్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: పి డి రాంబాబు



కాట్రేనికోన మార్చి 25 మనం ప్రతినిధిః ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలను లను డ్వాక్రా మహిళ లు సద్వినియోగం చేసుకొని మహిళలు అభివృద్ధి చెందాలని డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి రాంబాబు తెలిపారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయం నందు నిర్వహించిన మండల మిల్లెట్ శిక్షణ కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు మహిళా జీవనోపాదులు అభివృద్ధి దశలో నడవాలని తెలిపారు అనంతరం చిర్ర యానాం గ్రామం లో డ్వాక్రా మహిళలు చేసే సముద్రపు నాచు పెంపకం, నీళ్ల రేవు గ్రామం లో చేపట్టిన పీతల చెరువులను పరిశీలన చేశారు. కార్యక్రమంలోఎల్ హెచ్ ఏ పి ఎం వరాలబాబు, ఏపీఎం శ్రీనివాసరాజు, వెలుగు వి ఓ ఏ లు, సి సి లు, అకొంటెంట్ లు, ఫిషరీస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు

# చేతులు మారిన ఆర్సీబీ, ఆర్ఆర్

ఐపీఎల్ లో రెండు ఫ్రాంఛైజీలు చేతులు మారాయి. లీగ్ లో అత్యంత ఆకర్షణీయ జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పాటు రాజస్థాన్ రాయల్స్ వేరే యాజమాన్యాల అధీనంలోకి వెళ్లబోతున్నాయి. లీగ్ ఆరంభం నుంచి ఆర్సీబీని నడిపిస్తున్న యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యుఎస్ఎల్) సంస్థ.. ఏకంగా రూ.16,706 కోట్ల ధరకు ఆర్సీబీని అమ్మేసింది. ఆదిత్య బిర్లా గ్రూప్, టైమ్స్ ఆఫ్ఇండియా, బోల్ట్ వెంచర్స్, బీఎక్స్పీఈ-బ్లాక్ స్టోన్ సంస్థలు కలిసి ఈ ఫ్రాంఛైజీని చేజిక్కించుకున్నాయి. ఆర్సీబీ పురుషులతో పాటు మహిళల జట్టును కూడా కలిపే ఈ నాలుగు సంస్థల కన్సార్షియం సొంతం చేసుకుంది. మరోవైపు అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ వ్యాపారవేత్త కల్ సోమని నేతృత్వంలోని కన్సార్షియం సుమారు రూ.15,300 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంఛైజీని కొనుగోలు చేసింది. సోమనితో పాటు రిటైల్ దిగ్గజం 'వాల్ మార్ట్'కు చెందిన రాబ్ వాల్టన్, ఫోర్డ్ మోటార్ కంపెనీ యజమాని హాంప్ కుటుంబం కన్సార్షియంలో సభ్యులుగా ఉన్నారు. అరిజోనా కేంద్రంగా పనిచేసే సోమని గతంలోనే రాజస్థాన్ ఫ్రాంచైజీలో పెట్టుబడులు పెట్టాడు.




**అప్పుడు 500 కోట్లు, 300 కోట్లు**

ఆర్సీబీని తాము కొనుగోలు చేసినట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ అధినేత కుమార మంగళం బిర్లా, టైమ్స్ గ్రూప్ ఛైర్మన్ సత్యన్ గజ్వాని ధ్రువీకరించారు. 2008లో ఐపీఎల్ ఆరంభమైనపుడు ఆర్సీబీ ఫ్రాంఛైజీ విలువ రూ.500 కోట్లే కావడం విశేషం. అప్పటికి లీగ్ లో అత్యధిక ధర పలికిన రెండో ఫ్రాంఛైజీ అదే. అప్పుడు ఈ జట్టును కొన్న విజయ్ మాల్యా తర్వాత ఆర్థిక వివాదాల్లో చిక్కుకుని దేశం విడిచి వెళ్లిపోయాడు. మాల్యా భాగస్వామిగా ఉన్న యుఎస్ఎల్ సంస్థే ఫ్రాంఛైజీని నడిపించింది. ఐపీఎల్ ట్రోఫీ కోసం సీజన్ ఆరంభం నుంచి కొనసాగుతున్న నిరీక్షణకు గత ఏడాదే ఆర్సీబీ తెరదించింది. కానీ ట్రోఫీ విజయోత్సవ వేడుకల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంతో ఆర్సీబీకి అప్రతిష్ఠను తెచ్చిపెట్టింది.

దీనికి సంబంధించిన వివాదాలు, కేసుల నేపథ్యంలోనే ఆర్సీబీని యాజమాన్యం అమ్మకానికి పెడుతున్నట్లు వార్తలు వచ్చాయి. కారణాలు ఏవైనా సరే.. ఇప్పుడు ఆర్సీబీ చేతులు మారబోతోంది. ఇక ఐపీఎల్ ప్రారంభంలో అత్యల్పంగా రూ.300 కోట్లకు అమ్ముడైన రాజస్థాన్.. ఇప్పుడు ఈ స్థాయిలో విలువను దక్కించుకోవడం విశేషం. ఈ రెండు ఒప్పందాలకు బీసీసీఐతో పాటు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆమోద ముద్ర వేయాల్సి ఉంది.

## డకెట్ ఔట్.. రెండేళ్ల నిషేధం!

బ్లెస్సింగ్ ముజరబాని, దాసున్ శానక, స్పెన్సర్ జాన్సన్.. వీరంతా ఐపీఎల్ లో ఆడటం కోసం పాకిస్థాన్ సూపర్ లీగ్ నుంచి (పీఎస్ఎల్) నుంచి వైదొలగిన ఆటగాళ్లు. అదే సమయంలో ఓ ప్లేయర్ ఐపీఎల్ నుంచి వెళ్లిపోయాడు. దిల్లీ క్యాపిటల్స్ (డీసీ) ఆటగాడు బెన్ డకెట్ ఈ ఐపీఎల్ నుంచి ఉపసంహరించుకున్నట్లు వెల్లడించాడు. నిరుడు జరిగిన వేలంలో డీసీ అతణ్ని 2 కోట్లకు దక్కించుకుంది. ''దిల్లీ క్యాపిటల్స్ కు క్షమాపణలు తెలియజేస్తున్నా. ఇది కఠినమైన నిర్ణయమే.. అయినప్పటికీ నాకు తప్పడం లేదు. ఈ టోర్నీలో భాగమై ఉంటే అద్భుతంగా ఉండేది. కానీ ఇంగ్లాండ్ కు ప్రాతినిధ్యం వహించడం నా కల. రాబోయే టెస్టు సిరీస్ ల్లో ఇంగ్లాండ్ తరఫున మెరుగ్గా రాణించాలంటే (యాషెస్ లో విఫలమైన నేపథ్యంలో) మానసికంగా, శారీరకంగా సన్నద్ధతతో ఉండటం ముఖ్యం. అందుకోసం నేను తీసుకున్న ఈ నిర్ణయం సరైందేనని భావిస్తున్నా. యాషెస్ సిరీస్ మధ్యలో మద్యం తాగిన విషయంలో మన్నింపు కోరుతున్నా. నేనలా చేసుండకూడదు'' అని డకెట్ అన్నాడు. అయితే 2025 నుంచి ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఎవరైనా ఆటగాడు వేలంలో ఎంపికై, తర్వాత టోర్నీ నుంచి నిష్క్రమిస్తే అతడిపై రెండేళ్లు నిషేధం పడుతుంది. గాయం లేదా వైద్య సంబంధిత కారణాలకు మాత్రమే మినహాయింపు లభిస్తుంది. కాబట్టి డకెట్ 2027, 2028లోనూ ఐపీఎల్ కు దూరం కానున్నట్లే. డకెట్ గత ఏడాది యాషెస్ సిరీస్లో 10 ఇన్నింగ్స్ ల్లో కేవలం 220 పరుగులు మాత్రమే చేశాడు.



## ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం షేన్ వార్న్ కుటుంబానికి జాక్ పాట్



ఆస్ట్రేలియా స్పిన్ దిగ్గజం, దివంగత షేన్ వార్న్ కుటుంబానికి జాక్ పాట్ తగిలింది. రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీని అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ వ్యాపారవేత్త కల్ సోమని నేతృత్వంలోని కన్సార్షియం సుమారు రూ.15,300 కోట్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే షేన్ వార్న్ కుటుంబానికి అదృష్టం వరించనుంది. షేన్ వార్న్.. ఐపీఎల్ ప్రారంభ సమయంలో 2008లో రాజస్థాన్ కెప్టెన్ గా వ్యవహరించిన విషయం తెలిసిందే. అతడి సారథ్యంలో రాజస్థాన్ మొదటి సీజన్ లోనే విజేతగా నిలిచింది. అప్పట్లో వార్న్కు కేవలం కెప్టెన్సీ బాధ్యతలే కాకుండా.. జట్టుకు ఆడినంత కాలం ఏటా 0.75 శాతం యాజమాన్య వాటాను కూడా కేటాయించారు. షేన్ వార్న్ మొత్తం నాలుగు సీజన్లు ఆడాడు. దీంతో 3 శాతం వాటా అతడి సొంతమైంది. ఈ నేపథ్యంలో వార్న్ కుటుంబం ఆ వాటాలను విక్రయించడం ద్వారా సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.460 కోట్ల వరకు దక్కించుకునే అవకాశం ఉంది. అయితే ఈ ఒప్పందానికి బీసీసీఐ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. షేన్ వార్న్ 2022లో మృతి చెందిన విషయం తెలిసిందే.



# భాగ్యనగరంలో వారణాసి

## రాజమౌళి విజన్ మరింత పెద్దగా..


మహేశ్ బాబు కథానాయకుడిగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న ఎపిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న మూవీకి సంబంధించిన సెట్స్, మినియేచర్స్ ఫొటోలు అలరిస్తున్నాయి. 'వారణాసి'ని హైదరాబాద్ లో రీక్రియేట్ చేశారు. పాలిగాన్ సహా పలు హాలీవుడ్ మీడియా సంస్థల ప్రతినిధులు తమ సోషల్ మీడియా ఖాతాల్లో వీటిని పంచుకోవడంతో వైరల్ అవుతున్నాయి. ఈసారి రాజమౌళి విజన్ తారస్థాయిలో ఉందని కామెంట్లు పెడుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం మీరూ 'వారణాసి'ని దర్శించండి.



## భయపెడుతూ నవ్వించిన రాకాస ట్రైలర్..

'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' సినిమాలతో ఎంటర్ టైన్ చేసిన సంతోష్ శోభన్ హీరోగా నటించిన సినిమా 'రాకాస'. మెగా డాటర్ నిహారిక నిర్మించగా.. మానస శర్మ అనే అమ్మాయి దర్శకురాలిగా పరిచయమవుతోంది. హారర్ కామెడీ కాన్సెప్ట్ తో తెరకెక్కించారు. ఏప్రిల్ 3న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ఇది ఆకట్టుకునేలా ఉంది. ట్రైలర్ బట్టి చూస్తే.. ఇదివరకు వచ్చిన హారర్ సినిమాల్లానే ఇందులో స్టోరీ ఉన్నట్లు అనిపిస్తుంది. ఏ మాత్రం సంబంధం లేని హీరో, ఓ పల్లెటూరికి వస్తాడు. అక్కడే ఉండే ఓ అమ్మాయితో ప్రేమలో పడతాడు. అనుకోని విధంగా హీరో సమస్యల్లో చిక్కుకుంటాడు. బ్రహ్మ రాక్షసుడికి ఆహారంగా ఊరంతా కలిసి ఇతడిని పాడుబడ్డ కోటలోకి పంపిస్తారు. అక్కడ హీరోకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయనేదే స్టోరీలా అనిపిస్తుంది.

## రామ్ చరణ్ కోలుకున్నారు



'పెద్ది' సినిమా సెట్స్ లో రామ్ చరణ్ కు గాయపడటంపై టీమ్ స్పందించింది. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని తెలిపింది. సెట్స్ లో చరణ్ కుడి కంటికి స్వల్ప గాయమైందని, తగిన ట్రీట్ మెంట్ జరిగిందని పేర్కొంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అభిమానులకు సూచించింది. చరణ్ గాయం విషయంలో వస్తున్న రూమర్లను నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. గురువారం (మార్చి 26) నుంచి చరణ్ మళ్లీ షూటింగ్ లో పాల్గొంటారని తెలిపింది.

# లక్కీ ఛాన్స్ కొట్టేసిన కృతి


టాలీవుడ్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి 'మన శంకర వర ప్రసాద్ గారు' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత తన నెక్స్ట్ ప్రాజెక్ట్ పై దృష్టి పెట్టాడు. విక్టరీ వెంకటేష్ మరియు నందమూరి కళ్యాణ్ రామ్ ల కాంబినేషన్ లో ఆయన ఒక క్రేజీ మల్టీస్టారర్ ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంక్రాంతి రేసులో ఎప్పుడూ ముందుండే అనిల్, ఈ చిత్రాన్ని కూడా 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ల ఎంపిక ఇప్పుడు ఫిలిం నగర్లో హాట్ టాపిక్ గా మారింది. తాజా సమాచారం ప్రకారం, కళ్యాణ్ రామ్ సరసన 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ మల్టీస్టారర్ లో కృతి పాత్ర చాలా కీలకంగా ఉంటుందని సమాచారం. మరోవైపు, సీనియర్ హీరో వెంకటేష్ కు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఇప్పటివరకు తెరపై కనిపించకపోవడంతో ఫ్యాన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ప్రస్తుతం ఈ కాస్టింగ్ గురించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ, చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అతి త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. అనిల్ రావిపూడి మార్క్ కామెడీ మరియు కమర్షియల్ ఎలిమెంట్స్ తో కూడిన ఈ పక్కా సంక్రాంతి సినిమా ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది.




# రజినీకాంత్ మేకోవర్ కోసం ఏకంగా 83 లుక్స్

సూపర్స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం నెల్సన్ దర్శకత్వంలో 'జైలర్ 2' షూటింగ్ తో బిజీగా ఉన్నాడు. ఈ చిత్రం ఆగస్ట్ 12న విడుదల కానుండగా, ఆ తర్వాత రజనీ వరుస క్రేజీ ప్రాజెక్టులను లైన్ లో పెట్టాడు. కమల్ హాసన్ నిర్మాణంలో ఒక మల్టీస్టారర్ సినిమాతో పాటు, 'డాన్' ఫేమ్ సిబి చక్రవర్తి దర్శకత్వంలో కూడా ఒక సినిమా చేసేందుకు తలైవా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ఉన్నాయి. ముఖ్యంగా దర్శకుడు సిబి చక్రవర్తి తన నెక్స్ట్ ప్రాజెక్ట్ విషయంలో చాలా వేగంగా అడుగులు వేస్తున్నాడు. రజనీకాంత్ మేకోవర్ కోసం ఆయన ఏకంగా 83 రకాల లుక్స్ ను డిజైన్ చేయించడం ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ అయింది. వీటిలో అత్యుత్తమమైన మూడు లుక్స్ ను ఫైనల్ చేసి రజనీకి ప్రజెంట్ చేయగా, అందులో ఒక దానిని తలైవా ఖరారు చేయాల్సి ఉంది. ఒక స్టార్ హీరో కోసం ఇంత భారీ స్థాయిలో లుక్ టెస్టులు జరగడం అరుదైన విషయంగా చెప్పుకుంటున్నారు. అయితే, ఈ ప్రయోగంపై సోషల్ మీడియాలో రజనీ అభిమానుల నుండి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 75 ఏళ్ల వయసులో రజనీకాంత్ పై ఇన్ని రకాల లుక్ ఎక్స్పెరిమెంట్స్ చేయడం అవసరమా అని కొందరు ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. మరి సిబి చక్రవర్తి ఫైనల్ చేసే ఆ స్పెషల్ లుక్ తలైవాను ఏ రేంజ్ లో చూపిస్తుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# సక్సెస్ కోసం రామ్ ప్రయత్నాలు..



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని వరుస పరాజయాలతో సతమతమవుతున్నాడు. గత ఏడాది విడుదలైన 'ఆంధ్రా కింగ్ తాలుకా' సినిమాపై ఆయన ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు, కానీ అది బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ప్రస్తుతం కొంత విరామం తీసుకుంటున్న రామ్, తన నెక్స్ట్ మూవీ స్క్రిప్ట్ లపై ప్రత్యేక దృష్టి సారించాడు. ఈ క్రమంలోనే ఆయన కొత్త సినిమాకు సంబంధించిన అప్ డేట్ సిద్ధం చేస్తున్నాడట.

ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ గా పనిచేసిన లోగి విఘ్నేష్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడట. ఇది ఒక సరికొత్త తరహా 'న్యూ-ఏజ్ యాక్షన్ థ్రిల్లర్' అని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే వారం వెలువడే అవకాశం ఉంది. భారీ బడ్జెట్ తో తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రామ్ ప్రస్తుతం ప్రముఖ నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నాడు.

మరోవైపు, తన ఫేవరెట్ డైరెక్టర్ కిషోర్ తిరుమలతో కలిసి రామ్ స్వయంగా ఒక స్క్రిప్ట్ పై వర్క్ చేస్తున్నాడు. విశేషమేమిటంటే, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రామ్ స్వయంగా నిర్మించనున్నాడు. లోగి విఘ్నేష్ సినిమా పూర్తయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. వరుస ఫ్లాపుల తర్వాత రామ్ చేస్తున్న ఈ ప్రయత్నాలు ఆయనను మళ్ళీ సక్సెస్ ట్రాక్ ఎక్కిస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు.

## వారికి హరీష్ శంకర్ స్ట్రాంగ్ కౌంటర్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించకపోయినప్పటికీ, దర్శకుడు హరీష్ శంకర్ మాత్రం తన సినిమాను వెనకేసుకొస్తున్నారు. వరుస ఇంటర్వ్యూలు, ఫ్యాన్ మీట్స్ లో పాల్గొంటూ సినిమాను అగ్రెసివ్ గా ప్రమోట్ చేస్తున్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్ పై ఆయన ఘాటుగా స్పందించారు. తన తల్లిదండ్రులే తనను మొదట ట్రోల్ చేశారని, డైరెక్టర్ అవుతానన్నప్పుడు వారు కూడా నమ్మలేదని హరీష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



ఆన్ లైన్ ట్రోలర్ల గురించి మాట్లాడుతూ.. 'వాళ్లు ఎవరో, ఎక్కడి నుండి వస్తారో తెలియదు. వాళ్లకు కనీసం తమ గుర్తింపును బయటపెట్టే ధైర్యం కూడా లేదు. అలాంటి వారిని నేను అస్సలు సీరియస్ గా తీసుకోను' అని హరీష్ స్పష్టం చేశారు. ఒకవేళ తాను ట్రోల్స్ ను పట్టించుకుని ఉంటే ఈపాటికే సోషల్ మీడియా నుండి తప్పుకునేవాడినని చెప్పారు. ఎవరైనా హద్దు మీరి అసభ్య పదజాలం వాడితే బ్లాక్ చేయడమే కాకుండా, చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.

అనేక అడ్డంకులు ఎదురైనప్పటికీ, సినిమాను సకాలంలో థియేటర్లలోకి తీసుకురావడమే తన అతిపెద్ద విజయం అని హరీష్ శంకర్ పేర్కొన్నారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' అవుట్ పుట్ పట్ల తాను పూర్తి సంతృప్తిగా ఉన్నానని, ప్రేక్షకులు ఈ యాక్షన్ డ్రామాను ఆస్వాదిస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151,
And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.